

# బోనమెత్తిన చాపలగూడెం

**కుల్కచర్ల, జులై 11, ప్రభాతవార్త :** కుల్కచర్ల మండల పరిధిలోని చాపలగూడెం గ్రామంలో ఆషాఢమాసం పురస్కరించుకొని పోచమ్మ తల్లికి శుక్రవారం బోనాలు సమర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ సర్పంచ్ గండి లక్ష్మణ్ ముదిరాజ్ మాట్లాడుతూ ఏటా గ్రామంలో బోనాల

మిగతా 2లో



రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త

# సమన్వయ కృషితో ఫార్మాసిటీ అభివృద్ధి

**కలెక్టర్ నారాయణరెడ్డి**

**యాచారం, జులై 11 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టి ఫార్మాసిటీ పరిధిని ఫ్యూచర్ సిటీ డెవలప్మెంట్ అథారిటీగా ఏర్పాటు చేసిన సర్పంచ్‌ల పాలననే ఉంటుందని కలెక్టర్ నారాయణ రెడ్డి అన్నారు. శుక్రవారం మాడుగుల మండలం అభివృద్ధి పనులను ప్రారంభించిన అనంతరం మార్గం మధ్యలో యాచారం తహసీల్దార్ కార్యాలయం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అభివృద్ధి కోసం ఫ్యూచర్ సిటీ డెవలప్మెంట్ అథారిటీ ఏర్పడిందని పాలన గ్రామ పంచాయతీల ద్వారానే ఉంటుందన్నారు. ఫార్మాసిటీ భూ నిర్వాసితులకు అర్హులైన వారం దరికీ పారదర్శకంగా ప్లాట్లను అందించమని ఆదేశించారు. ప్రజల ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయ కృషితో సమగ్ర అభివృద్ధి సాధ్యమన్నారు.

## రూ.45 కోట్లతో

# మినీ ట్యాంకుబండ్



కొడంగల్ పెద్ద చెర్వుకట్టపై ట్యాంకుబండ్ పనులకు భూమిపూజ చేస్తున్న తిరుపతిరెడ్డి తదితరులు

**కొడంగల్ పెద్ద చెరువు కట్ట సుందరీకరణ చేసి పర్యాటక ప్రాంతంగా తీర్చి దిద్దుతాం**

**సంక్షేమంతోపాటు సమానంగా అభివృద్ధికి పెద్ద పీట**

**ప్రతి గ్రామానికి తారు రోడ్లు నిర్మిస్తున్నాం**

**కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జ్ తిరుపతిరెడ్డి**

**కొడంగల్, జులై 11 ప్రభాతవార్త :** అర్హులైన ప్రతి పేదవారికి ఇందిరమ్మ ఇళ్ళు అందించడమే ప్రధాన లక్ష్యమని కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జ్ ఎనుముల తిరుపతిరెడ్డి అన్నారు. శుక్రవారం కొడంగల్ మున్సిపల్ పరిధిలోని ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో నిర్మాణం చేసిన ఇందిరమ్మ నమూన ఇంటిని ప్రారంభించారు. అనంతరం కొడంగల్ పెద్ద చెర్వు దగ్గర రూ.45 కోట్లతో నిర్మించే మినీ ట్యాంక్ బండ్ పనులకు ఆయన భూమిపూజ చేశారు. అనంతరం స్థానిక కడా కార్యాలయంలో నియోజకవర్గంలోని 8 మండలాలకు సంభందిచిన రూ.1.58 కోట్లకు సంభందించి 293 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని విస్మరించిందని అన్నారు.10 ఏళ్ళ బీఆర్ఎస్ పాలనలో పేదలకు ఒక్క ఇంటిని కూడ అందించ లేకపోయిందన్నారు. రెండు పడకల ఇళ్ళను అందిస్తామని కాలయపన చేసేంది తప్ప పేదలకు ఎలాంటి పథకాలను అందించలేక పోయిందన్నారు. అలాంటిది ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం అర్హులైన పేదలందరికి ఇందిరమ్మ ఇళ్ళు అందించేందుకు చర్యలు చేపట్టిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఓ పక్క సంక్షేమ పథకాలను అందిస్తునే అభివృద్ధి పనులను కొనసాగిస్తుందన్నారు. అన్ని రంగాల్లో వెనుకబడిన కొడంగల్‌ను అభివృద్ధి పరుస్తు రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. మరోపక్క నియోజకర్గంలో రోడ్ల అభివృద్ధి పనులు యుద్ధ ప్రాతిపదికన కొనసాగుతున్నాయని, ప్రతి గ్రామానికి బీటీ రోడ్డు పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. ఈ ప్రాంతంలో విద్యా సంస్థల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. అందులో భాగంగా కోస్గిలో ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల, కొడంగల్‌లో ప్రభుత్వ మెడికల్, వెటర్నరీ, నర్సింగ్ కళాశాలల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. మరోపక్క ఎలాంటి సాగునీటి వసతి లేని కొడంగల్‌కు సాగు, తాగునీరు అందించేందుకు గాను నారాయణపేట్-కొడంగల్ ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుట్టిందన్నారు. పథకంకు సంభందించి సర్వే పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి, మున్సిపల్ కమీషనర్ బలరాంనాయక్, ఎంపీడీఓ ఉషశ్రీ, జిల్లా గ్రంధాలయ చైర్మేన్ రాజేష్‌రెడ్డి,మాజీ ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, మార్కెట్ కమిటీ అధ్యక్షులు అంబయ్యగౌడ్, పార్టీ మండల అద్యక్షులు నందారం ప్రశాంత్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ శంకర్‌నాయక్‌లతో పాటు వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# జైపాల్‌రెడ్డి సేవలు చిరస్మరణీయం

**మంత్రులు జూపల్లి, కోమటిరెడ్డి, దామోదర రాజనర్సింహ నివాళి**

**మాడుగుల, జూలై 11, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన మాడుగులలో దివంగత కేంద్ర మాజీ మంత్రి జైపాల్ రెడ్డి విగ్రహానికి పలువురు ప్రముఖులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామంలో శుక్రవారం వివిధ అభివృద్ధి పనులకు రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహలు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు జైపాల్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. అనంతరం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే

మిగతా 2లో

# ఉల్లంఘనులు





## కోట్ల విలువైన శికం భూములపై బడా బాబుల కన్ను

**అనుమతి లేకుండా షాపింగ్ కాంప్లెక్స్**

**చోద్యం చూస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు**

**సాక్షాత్తూ సబ్‌కలెక్టరేట్ ఎదురుగానే అక్రమాల జాతర**

**అధికారులు కళ్లు తెరవాలని స్థానికుల డిమాండ్**

**అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు**

**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** తాండూరు మున్సిపాలిటీ పరిధిలో ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. పట్టపగలే పర్మిషన్ లేని కట్టడాలు చేపడుతున్నా అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. విజయ విద్యాలయ ఎయిడెడ్ స్కూలు (వీవీహెచ్ఎస్) పరిసరాలలో ఓ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తున్నారు. దానికి మున్సిపల్ అనుమతులు లేవు. సాక్షాత్తూ తాండూరు సబ్‌కలెక్టరేట్ ఎదురుగా ఈ దుకాణాల నిర్మాణం చకచకా సాగుతోంది. మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు ఇప్పటి వరకు అభ్యంతరాలు వ్యక్తం చేయలేదని సమాచారం. సర్వేనెంబరు 111లో ఖాళీగా ఉన్న 22,500 చదరపు గజాల స్థలం ఉంది. ఈ విలువైన స్థలంలో ప్రభుత్వ అధీనంలో ఉందా, లేక ప్రయివేటు కబంధ హస్తాల్లో నలిగిపోతుందా తేల్చాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. గొల్లచెర్వు శిఖం భూములుగా గుర్తించినా పలుచోట్ల ఆక్రమణలు, అక్రమ కట్టడాలు చేపట్టారు. ఇంకా మిగిలివున్న ఖాళీ స్థలాన్ని అసైన్‌మెంట్ చేసి ప్రజాప్రయోజనాల కోసం వినియోగించాలని ప్రజాప్రతినిధులు పలుమార్లు విజ్ఞప్తులు చేశారు. కానీ ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి నిర్ణయాలు తీసుకోలేదు. అక్కడ చదరపు గజం ధర రూ.20 వేల పైమాటే ఉంటుందని అంచనా. కొంత కాలంగా ఈ స్థలంలో కొంత భాగాన్ని లారీ ట్రాన్స్‌పోర్టు నిర్వాహకులు సరకుల అన్‌లోడింగ్‌కు తీసుకున్నారు. దానిపక్కనే కొంతభాగంలో సీడీపీ కింద రూ.10 లక్షలు మంజూరు చేసి షాపులు కడుతున్నారు. ఈ దుకాణాల సముదాయానికి 2023 అక్టోబరులో అప్పటి మంత్రి మహేందర్‌రెడ్డి, అప్పటి ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. స్థలంపై ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోకుండానే దర్జాగా నిర్మాణాలు, వ్యాపారాలు చేపట్టడమేమిటని స్థానికులు మండిపడుతున్నారు.

**అనుమతులు లేని మాట నిజమే**

షాపింగ్ కాంప్లెక్ నిర్మాణంపై స్థానికుల మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ విక్రమసింహారెడ్డిని వివరణ కోరగా.. వీవీహెచ్ఎస్ పరిసరాలలో షాపింగ్ కాంప్లెక్స్‌కు మున్సిపాలిటీ నుంచి ఎలాంటి అనుమతులు లేవని స్పష్టం చేశారు. ఇటీవల నిర్మాణాలపై కొంతమంది తమకు ఫిర్యాదు చేశారని తెలిపారు. ఇల్లీగల్‌గా నిర్మాణాలు చేపడుతున్నందున పనులను నిలిపివేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించినట్లు కమిషనర్ వీసీ రెడ్డి తెలిపారు.

# బిసి బంధువయా...

**42 శాతం రిజర్వేషన్‌పై బిసి వర్గాల సంబురం**

**షాద్‌నగర్ పట్టణంలో టపాసులు కాల్చి హర్షం**

**డప్పుల దరువులతో సందడి**

**సిఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం**

**రాజకీయ చరిత్రలో గొప్ప సాహసోపేతం**

**రానున్నది బిసి రాజ్యమే : ఎమ్మెల్యే శంకర్**

**అంబేద్కర్ విగ్రహానికి నివాళి**



అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే శంకర్

**షాద్‌నగర్, ప్రభాతవార్త, జులై11 :** నలభై రెండు శాతం రిజర్వేషన్‌ను ఖరారు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో షాద్‌నగర్ పట్టణంలో బిసిలు సంబురాలు చేసుకున్నారు. పట్టణ కూడలికి వందలాదిగా తరలివచ్చిన బిసి టపాసులు కాల్చి, డప్పుల దరువులతో సందడి చేశారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పట్టణ కూడలికి చేరుకొని బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీసీ సంఘాల నాయకులు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించి మిఠాయిలు తినిపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. అనంతరం ర్యాలీగా తరలివెళ్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద గల జ్యోతిబాయ్ పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రానున్నది బీసీల రాజ్యమేనని, బీసీలు అన్ని రంగాలలో రాణించి దేశానికి గొప్ప పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు. బీసీల రాజకీయ అభ్యున్నతికి ఏఐసీసీ అధినేత రాహుల్‌గాంధీ ప్రకటించిన బిసి డిక్లరేషన్ ప్రకారం 42శాతం రిజర్వేషన్‌లను కల్పించినట్లు తెలిపారు. తమది ఫామ్ హౌజ్ క్యాబినెట్ కాదని, సెక్రటేరియట్ పాలన అని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఉద్దేశించి విమర్శించారు. రాజకీయ చరిత్రలో సంచలనం రేకెత్తించే గొప్ప సాహసోపేతమైన 42 శాతం రిజర్వేషన్ నిర్ణయాన్ని అమలు చేయబోతున్నామని అన్నారు. గతంలో 7 శాతం ఉన్న వర్గాలు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను, 0.5 శాతం ఉన్న వర్గాలు తెలంగాణను సుధీర్ఘకాలం పాలించాయని, ఇది రాజకీయ అసమానతలకు, అన్యాయాలకు నిదర్శనమని అన్నారు. 100 ఎలుకలు తిన్న పిల్లి తీర్థయాత్రలు వెళ్లినట్లు జాగృతి నాయకురాలు ఎమ్మెల్సీ కవిత బీసీల రిజర్వేషన్‌పై కాంగ్రెస్‌ను విమర్శించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మద్యం కుంభకోణంలో జైలు పాలైన వాళ్లు కూడా నీతులు చెబుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీకి బీసీలపై పూర్తి చిత్తశుద్ధి ఉందన్నారు. నియోజకవర్గంలో బీసీ సేన ఆధ్వర్యంలో

మిగతా 2లో



మాట్లాడుతున్న బీఎస్పీ నేత శ్రీనివాస్

**బిసిలు స్థానిక సంస్థలకే**

# పరిమితమవ్వాలా?

**చట్ట సభలకు అగ్రకులాలు మాత్రమేనా.!**

**కాంగ్రెస్ తెచ్చిన రిజర్వేషన్లతో ఏమి ప్రయోజనం**

**బిసిలు చట్టాలు చేయగలరా?**

**బీఎస్పీ రంగారెడ్డి జిల్లా ఇంచార్జి శ్రీనివాస్ ధ్వజం**

**షాద్‌నగర్, ప్రభాతవార్త, జులై11 :** 42 శాతం రిజర్వేషన్లతో బీసీలు చట్ట సభల్లోకి ఎలా వెళ్తారో చెప్పాలంటూ బీఎస్పీ రంగారెడ్డి జిల్లా ఇంచార్జి దొడ్డి శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీని నిలదీశారు. శుక్రవారం ఆయన 42 రిజర్వేషన్లపై స్పందిస్తూ మీడియాకు, బీసీలకు జరుగుతున్న అన్యా యాలను, కాంగ్రెస్ పార్టీ మోసపూరిత విధానాలను ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ తెచ్చిన ఈ రిజర్వేషన్ల వల్ల బీసీ సమాజం తమ నాయకులను పార్లమెంటు, అసెంబ్లీలోకి ప్రతినిధులను ఎన్నుకో లేరని, చట్టాలు చేయ లేరని అన్నారు. చట్టాలు చేయడానికి వీలు కాని విధానాలను బీసీల ముందు బూచీగా చూపిస్తూ, బీసీలు ప్రతినిధులుగా ఎన్నిక కాలేని రిజర్వే షన్ల వల్ల ఉపయోగం ఏమిటని అన్నారు. ఈ రిజర్వేషన్ల వల్ల వచ్చి సర్పం చ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ పదవులు జిల్లా కలెక్టర్ తొలగిస్తే పోయేవని, అధికారులు తొలగిస్తే పోయే పదవుల వల్ల బీసీలకు ఎలా న్యాయం జరుగుతుందో కాంగ్రెస్ పార్టీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలపాలని డిమాండ్ చేశారు. పార్లమెంటు, అసెంబ్లీలలోకి అగ్రకులాలను, స్థానిక సంస్థల్లో బీసీలను పరిమితం చేయడానికి ఎన్నికల ఎత్తుగడగా రిజర్వేషన్ తీసుకువచ్చిందంటూ కాంగ్రెస్ పార్టీ తీరును ఆయన ఎండగట్టారు. ఇప్పటికైనా బీసీలు కళ్లు తెరిచి అగ్రకుల పార్టీల మోసాలను తిప్పికొట్టాలని కోరారు.

# దేశ సారధులు మీరే..

**విద్యార్థి నేతలకు కలెక్టర్ ప్రతీక్ జైన్ పిలుపు**

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, జులై 11, ప్రభాతవార్త :** దేశ భవిష్యత్తు దశ దిశను మార్చేది విద్యనే అని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. శుక్రవారం వికారాబాద్ మునిసిపల్ పరిధిలోని శివరెడ్డి పేట మైనార్టీ రెసిడెన్షియల్ కళాశాలలో రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన, కళాశాలలో వివిధ విభాగాలకు ఎన్నికల్లో నాయకులుగా ఎంపికైన విద్యార్థినులకు సన్మాన కార్యక్రమం నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి ముఖ్యతిథిగా విచ్చేసిన జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ మాట్లాడుతూ విద్య పట్ల సా నుకూల శక్తితో ముందుకు వెళ్తూ ఉన్నత శిఖరాల ు అధిరోహించాలన్నారు. ప్రతి విద్యార్థి ఉన్నత స్థాయిలో ఎదగడానికి, ఐఏఎస్, ఐపీఎస్ కావాలన్నా మంచి కలల ు కనాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు. దేశ భవిష్యత్తు యువత పైనే ఉందని, దేశాన్ని ముందుకు తీసుకు వెళ్లాల్సిన బాధ్యత కూడా మీపై ఉందని విద్యార్థులనుద్దేశించి కలెక్టర్ తెలిపారు. న్యాయ, వైద్య, ఐఐటి తరగతులు నిర్వహించేందుకు పరిపాలనపరంగా ఖచ్చితమైన చేయూత అందిస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. కళాశాలలో విద్యార్థులు చేపట్టిన మాక్ ఎన్నికల నిర్వహణ విధానంపై చేపట్టిన వీడియో ఎంతగానో ఆకట్టుకుంది. రాష్ట్రస్థాయి ఇంటర్మీడియట్ మొదటి, రెండవ సంవత్సరంలో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థినిలకు ఘనంగా సన్మానించడంతో పాటు రూ.10 వేలు నగదు పారితోషికాన్ని కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. కళాశాలలో ఎన్నికైన లీడర్ల ను కలెక్టర్ సన్మానించారు. అనంతరం వసతి గృహంలోని భోజనశాలలో విద్యార్థినిలతో కలిసి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ హర్ష్ చౌదరి మధ్యాహ్న భోజనం చేశారు. బియ్యం, కంది పప్పు, రవ్వ నాణ్యత ను కలెక్టర్ పరిశీలించారు. పిన్సిపల్ మహమూదా ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణ రెడ్డి

# ఇళ్ల నిర్మాణంలో పారదర్శకత పాటించాలి

**అధికారులకు కలెక్టర్ నారాయణ రెడ్డి ఆదేశం**

**యాచారం, జులై, 11, ప్రభాతవార్త :** ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో పారదర్శకత పాటించాలని అర్హులైన వారికి చిన్న చిన్న సడలింపుల కోసం వివరణ ఇవ్వాలని జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం యాచారం మండలం కేంద్రంలోని తాసిల్దార్ కార్యాలయాన్ని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి సందర్శించారు. ఇబ్రహీంపట్నం ఆర్డిఓ అనంతరెడ్డి, తాసిల్దార్ అయ్యప్ప, ఎంపీ ఓ శ్రీలత, పంచాయతీ ఏఈ సూర్యవంశం, హౌసింగ్ ఏఈ వైష్ణవి , వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అధికారంలో ఉద్దేశించి మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో పారదర్శకత పాటిస్తూ పరులైన లబ్ధిదారులకు న్యాయం చేకూరేలా చిన్న చిక్కుముడులు ఉంటే సంబంధించిన అంశం పై వివరణ ఇస్తూ ఉన్నత అధికారులకు దృష్టికి తీసుకువెళ్తూ ముందుకెళ్లాలన్నారు. ఇప్పటికి నిర్మాణం చేపట్టినీ వారిని గుర్తించు లిస్టులో నుంచి పేరు తొలగించి అర్హత కలిగి ఉండి ఆసక్తిగా ఉన్న వారి పేరు నమోదు చేయాలని ఆదేశించారు. నిర్మాణం పనులు వేగవంతం అయ్యేలా చూడాలని సూచన చేశారు. హరిత హారం కోసం అందరూ సిద్దంగా ఉండాలని ఆదేశించారు.

# పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

**తరచుగా వైద్య పరీక్షలు జరిపించండి**

**మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య దేవేందర్ ఆదేశం**



మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య దేవేందర్ యాదవ్

**కొత్తూరు, ప్రభాతవార్త, జులై 11 :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 100 రోజుల ప్రత్యేక ప్రణాళికలో భాగంగా కొత్తూరు పురపాలక సంఘం పారిశుద్ధ్య కార్మికుల కోసం శుక్రవారం మున్సిపల్ చైర్ పర్సన్ లావణ్య దేవేందర్ యాదవ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య పరీక్షా శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులు పట్టణ శుభ్రతకు కీలకంగా పనిచేస్తారని, వారి ఆరోగ్యం మెరుగ్గా ఉండాలంటే ఈ విధమైన వైద్య శిబిరాలు అవసరమని, ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేయకుండా తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు.

## అమ్మవారికి ప్రత్యేక పూజలు



అమ్మవారిని దర్శించుకున్న కార్పొరేటర్

**కంటోన్మెంట్, జూలై 11 ప్రభాతవార్త:** ఆదివారం నాడు బోనాల సందర్భంగా కుటుంబ సభ్యులతో మోండా డివిజన్ కార్పొరేటర్ కొంతం దీపిక ఉజ్జయిని మహంకాళి దేవాలయం, రేణుక ఎల్లమ్మ, మావురాల పెద్దమ్మ దేవాలయం, పోచమ్మ, కట్ట మైసమ్మ మరియు ఉప్పలమ్మ దేవాలయాలలో అమ్మవారిని దర్శించుకొని ఒడి బియ్యం సమర్పించుకున్నారు.

## నిరంతర ఆంగ్ల అభ్యాసం ద్వారా కెరీర్‌లో పురోగతి సాధించవచ్చు



ప్రసంగిస్తున్న డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మట్టా శేఖర్

**చిక్కడపల్లి, జూలై 11 ప్రభాతవార్త:** నిరంతర ఆంగ్ల అభ్యాసం ద్వారా కెరీర్‌లో పురోగతి సాధించవచ్చని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శేఖర్ మట్టా అన్నారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కళాశాల లో ఆంగ్ల విభాగం "నిరంతర ఆంగ్ల అభ్యాసం ద్వారా కెరీర్ పురోగతి" అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ మట్టా శేఖర్, కళాశాల ఆంగ్లవిభాధిపతి కె.కవిత మాట్లాడారు. ఈ సదస్సులో ప్రఖ్యాత నిపుణురాలు పెర్సిస్ సునీత అంతర్దృష్టితో కూడిన ప్రజంటేషన్ ఇచ్చారు, ఇది నేటి పోటీ ఉద్యోగ మార్కెట్లో ఆంగ్ల ప్రావీణ్యం యొక్క కీలక పాత్రను హైలైట్‌గా నిలుస్తుందని వక్తలు పేర్కొన్నారు. కెరీర్ ఎదుగుదలకు, విజయానికి రాతపూర్వక, మాట్లాడే బలమైన కమ్యూనికేషన్ స్కిల్స్ ఎంత అవసరమో ఇందులో ప్రసావించారు. పెర్సిస్ సునీత సమర్ధవంతమైన అధ్యయన పద్ధతులు, అందుబాటులో ఉన్న వనరులను ఉపయోగించుకోవడం, కమ్యూనికేషన్ లో విశ్వాసాన్ని పెంపొందించడంతో సహా ఆంగ్ల భాషా నైపుణ్యాలను పెంపొందించడానికి ఆచరణాత్మక చిట్కాలు, వ్యూహాలను అందించారు. కార్యక్రమం అనంతరం విద్యార్థినీ విద్యార్థులఉ అడిగిన పలు ప్రశ్నలతో కార్యక్రమం ఎంతో ఆసక్తిని కనబరిచింది.

## ఆశాడ బోనాల సందర్భంగా చెక్కుల పంపిణీ



జీటీఎస్ దేవాలయంలో ఆశాడం బోనాల చెక్కులను అందజేస్తున్న నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి.

**యూసుఫ్‌గూడ, జూలై 11, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆశాడ బోనాల జాతర పండుగ సందర్భంగా ప్రభుత్వం ద్వారా జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని అన్ని డివిజన్ల బస్తీల కాలనీల దేవాలయాలకు చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. వెంగళ్‌రావునగర్, జీటీఎస్ కాలనీ శ్రీ వీరాంజనేయ భవాని శంకర అయ్యప్పస్వామి సాయిబాబా దేవాలయ ప్రాంగణంలో అమ్మవారి దేవాలయాలకు చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి, నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ అజారుద్దీన్, కంటెస్టెడ్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్, సీఎన్ రెడ్డి, బాబా ఫసియుద్దీన్, ఆలయ కార్యనిర్వాహణాధికారి గుమ్మడిదల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## రక్త దానం చేయండి ప్రాణదాతలు కండి.

**యూసుఫ్‌గూడ, జూలై 11, ప్రభాతవార్త :** నిమ్స్ బ్లడ్ బ్యాంకు ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక పోలీస్ 1వ బెటాలియన్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. బెటాలియన్ కమాండెంట్ మురళీకృష్ణ చేతల మీదుగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. రక్తదానం చేయండి ప్రాణదాతలు కండి అంటూ ముందుకు వచ్చారు. ఈ రక్తదాన కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ నరేంద్రసింగ్, ఆర్ఐ రాజేష్, నిమ్స్ బ్లడ్ బ్యాంక్ సెంటర్ అడిషనల్ ప్రొఫెసర్ డాక్టర్ మురళీకృష్ణ కోఆర్డినేటర్ వెంకటరత్నం, బిడుగు శేఖర్, సీనియర్ టెక్నికల్ ఆఫీసర్ మల్లికార్జున, డాక్టర్ రంజిత్, డాక్టర్ కోమలి తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

(మొటి పేజీ తరువాయి)

ఈ శిబిరంలో ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు వివిధ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు అందజేశారు. పురపాలక సంఘం ఈ తరహా సేవా కార్యక్రమాలు భవిష్యత్తులోనూ కొనసాగిస్తుందని చైర్ పర్సన్ లావణ్య యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎల్.బాలాజీ, కౌన్సిలర్లు మాదారం నర్సింహ్మా, జె.అనిత శ్రీనివాస్ గౌడ్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాజేష్, ఎమ్ఎల్‌హెచ్‌పీ డాక్టర్లు సీహెచ్‌వో నగేష్, వైద్య సిబ్బంది, మెప్మా సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జైపాల్ రెడ్డి సేవలు చిరస్మరణీయం

(మొదటి పేజీ తరువాయి)

కసిరెడ్డి నారాయణరెడ్డి, అభ్యుదయ ఫౌండేషన్ చైర్మన్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మామ సూదిని పద్మా రెడ్డి, సూదిని మనోహర్ రెడ్డి, పిసిసి కార్యవర్గ సభ్యులు మాజీ ఎంపీపీ సూదిని రామ్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బట్టు కిషన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు సూదిని కొండల్ రెడ్డి సూదిని శరత్ రెడ్డి, మాజీ ఎంపీపీ అన్నపాక జంగయ్య, తాజా మాజీ ఉపసర్పంచ్ మిద్దె రాములు, మాజీ ఎంపిటిసి ముదివెంటి దేవయ్య గౌడ్, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు యా చారం వెంకటేశ్వర్లు గౌడ్ రేవంత్ రెడ్డి మిత్రమండలి అధ్యక్షులు భాస్కర్, తదితర నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## బోనమెత్తిన చాపలగూడెం

(మొదటి పేజీ తరువాయి)

సమర్పణ ఎంతో ఉత్సాహంగా జరుగుతుందని ప్రతి ఏడాదిలాగే ఈసారి కూడా గ్రామ ప్రజలు భారీ ఎత్తున అమ్మవారికి బోనాలు సమర్పించారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ చిట్టిల రాములు, పగిడాల రాములు, కుమ్మరి గోపాల్, గండి సత్తయ్య, యానగుంది కృష్ణారెడ్డి, గ్రామ పెద్దలు చిట్టెల నరసయ్య , గ్రామ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

### ఉన్నత విద్యాను అభ్యసించే వారిదే భవిష్యత్తు :కార్పొరేటర్

**బేగంబజార్,జూలై 11ప్రభాతవార్త:** జాంబాగ్ డివిజన్ పరిధిలోని గౌలిగూడ జాన్సీ హైస్కూల్‌లోని విద్యార్థులకు డివిజన్ బిజెపి కార్పొరేటర్ రాకేష్‌జైస్వాల్ నోట్ బుక్‌లను అందచేశారు. ఈసందర్భంగా ఆయన ప్రతి యేటా మాదిరిగానే ఈయేడు కూడా విద్యార్దినీ,విద్యార్దులకు నోట్ బుక్‌లను అందచేయడం జరిగిందన్నారు. ఈకార్యక్రమంలో బిజెపి నేత శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.

## భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు చేపట్టాలి : ఎమ్మెల్యే తలసాని



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని.

**బేగంపేట జూలై 11,ప్రభాతవార్త**

ఈ నెల 13న జరగనున్న సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారి ఆషాడ బోనాల జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేయాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. శుక్రవారం ఉజ్జయినీ మహాకాళీ ఆలయం వద్ద ఆయన అధికారులతో కల్సి ఏర్పాట్లను పరిశీలించారు. ఏర్పాట్లపై భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆయన అధికారులకు పలు సూచనలు చేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బోనాల ఉత్సవాలు మనందరి పండుగ అని గొప్పగా జరుపుకుందామని కోరారు. బోనాల సందర్భంగా ఎంతో చరిత్ర కలిగిన మహాకాళీ అమ్మ వారి దర్శనం కోసం బోనాలు సమర్పించేందుకు వివిధ ప్రాంతాల నుంచి లక్షలాది మంది భక్తులు వస్తారని, వారికి ఎలాంటి అసౌకర్యం కలుగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అమ్మ వారి ఆశీస్సులతో సంతోషంగా ఉండాలని భక్తులు మొక్కులు తీర్చుకుంటారని అన్నారు. 13వతేదీన తెల్లవారుఝామున 3గంటల నుంచే బోనాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. భక్తులు క్యూలైన్లలో ఇబ్బందులు పడకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. శాంతి భద్రతల పర్యవేక్షణ కోసం సీసీ కెమెరాలతో నిఘాను ఏర్పాటు చేసామన్నారు. వివిధ ప్రాంతాల నుంచి అదనపు పోలీసు సిబ్బందిని కూడా రప్పించినట్లు తెలియజేసారు. భక్తులకు తాగునీరు అందించేందుకు వాటర్ వర్క్స్ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారన్నారు. దక్కన్ మానవ సేవా సమితి, ఆర్యసమాజ్,వంటి పలు సంస్థలు వాలెంటీర్‌లుగా భక్తులకు సేవలు అందించేందుకు సిద్దంగా ఉన్నాయన్నారు. ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకు వస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు మల్లిఖార్జున్‌గౌడ్, అరుణాగౌడ్, బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, ఈఓ ,డీసీ డాకు నాయక్, ఈఈ సుబ్రమణ్యం, వాటర్‌వర్క్స్ డీజీఎం ఆశీష్, తహశీల్దార్

## బిసిలకు 42శాతం రిజర్వేషన్ కల్పించడం చరిత్రాత్మకం

### - ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



ఎమ్మెల్యే నివాసం సంబరాలు చేసుకుంటున్న కాంగ్రెస్ నేతలు

**అత్తాపూర్ జూలై10,ప్రభాతవార్త :** స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42శాతం రిజర్వేషన్ కల్పించడం చరిత్రాత్మక నిర్ణయమని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు. 42శాతం బిసి రిజర్వేషన్ల పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ శుక్రవారం మైలర్‌దేవ్‌పల్లిలోని ఎమ్మెల్యే నివాసంలో పార్టీ నాయకులతో కలిసి సిఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ క్షీరాభిషేకం చేశారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ... స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బీసీ రెసర్వేషన్ అమలు చరిత్రాత్మక నిర్ణయమని సిఎం రేవంత్ రెడ్డి,పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వెనుకబడిన తరగతుల రిజర్వేషన్ల అంశంపై బీసీల హక్కులు సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో బీసీల పాత్ర అమోఘమైనదని వారి అభ్యున్నతికి ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ప్రస్తుతం ఉన్న రిజర్వేషన్ల అమలుతీరును సమీక్షించి అవసరమైతే వాటిని మరింత పటిష్టం చేయడానికి తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన ప్రకటించారు. సిఎం రేవంత్ రెడ్డి ఒక ఓసి బిడ్డ ముఖ్యమంత్రిగా ఉంటూ బీసీలపై ఎనలేని ప్రేమ చూపించారని కొనియాడారు అలాగే పిసిసి ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్ కూడా ఒక బీసీ పీసీసీ ప్రెసిడెంట్ గా ఉండడం బీసీ లందరికీ గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో మైలర్‌దేవ్‌పల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నత్తి ధనుంజయ్ ,కాంగ్రెస్ నేతలు సరికొండ వెంకటేష్, శివ, తదితరులు పాల్గొన్నారు.

## అంబర్‌పేటలో రూ.10 కోట్లతో రోడ్డు పనులు : ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



బర్కత్‌పురలో సిసి రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, చిత్రంలో కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్ తదితరులు

**హైదరాబాద్, జూలై 11 ప్రభాతవార్త**

అంబర్‌పేట నియోజకవర్గంలో 10 కోట్లతో రోడ్ల పనులు, మరో మూడు కోట్లతో వాటర్ వర్క్స్ పనులు చేపడుతున్నామని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ వెల్లడించారు. శుక్రవారం కాచిగూడ డివిజన్ పర్వరీష్ బాగ్ కాలనీలో రూ.29 లక్షల వ్యయంతో నూతనంగా చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణపు పనులను స్థానిక కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్ తో కలిసి ఎమ్మెల్యే ప్రారంబించారు. ఆనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో జీహెచ్‌ఎంసీ ద్వారా ఇప్పటికే రూ.10 కోట్లతో రోడ్ల అభివృద్ధి పనులు జరుగుతున్నాయని. మరో రూ.10 కోట్ల రోడ్ల పనులకు ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. వీటికి నిధులు కూడా మంజూరై టెండర్ ప్రాసెస్లో ఉన్నాయని, వాటిని త్వరలోనే ప్రారంభిస్తామని తెలిపారు. జలమండలి ఆధ్వర్యంలో రూ.3కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, మరో రూ.3కోట్ల కోసం ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా అంబర్‌పేట నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలను ఖచ్చితంగా పాటించాలని అధికారులకు సూచించారు. ప్రణాళికాబద్ధంగా ప్రగతి. ఎమ్మెల్యే కాలనీలో పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రణాళికబద్ధంగా ప్రగతి సాధిస్తున్నామని, మౌలిక వసతుల కల్పన, రోడ్లు, డ్రైనేజ్, మంచి నీటి వసతిని మెరుగుపరుస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసురోవడంతో పాటు వాటికి శాశ్వత ప్రతిపాదికన పరిష్కారాలు చూపిస్తున్నామని తెలిపారు. ప్రజల నుంచి ఫిర్యాదు అందిన వెంటనే సమస్యలను పరిష్కరించాలని అధికారులకు, సిబ్బందికి సూచిస్తున్నామని తెలిపారు. ప్రజలు కూడా ఎవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రవీణ్, ఆసిస్టెంట్ ఇంజనీర్ ప్రశాంత్, జలమండలి డిప్యూటీ జనరల్ మేనేజర్ కృష్ణ. వర్క్ ఇన్స్పెక్టర్ వెంకటేష్, బీఆర్ఎస్ డివిజన్ ఆధ్యక్షుడు ఎర్ర భీష్మదేవ్, డాక్టర్ బద్దుల శిరీష ఓంప్రకాష్ యాదవ్, దాత్రిక్ నాగేందర్ బాబ్లీ, బబ్లూసింగ్, బీజేపీ నేతలు సుభాష్ పటేల్, బల్వీర్, బి.భీమ్రాజ్, ఎస్. రవియాదవ్, హజారి బాబు, తదితరులు పాల్గొన్నారు

## చిన్నారి మృతిపై వైద్య శాఖ సమగ్ర విచారణ జరపాలి



ఆసుపత్రి ఎదుట ఆందోళన చేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

**నాచారం, జులై 11 ప్రభాతవార్త :** చిన్నారి మృతిపై వైద్య శాఖ సమగ్ర విచారణ జరపాలని సీపీఐ, ఏఐవైఎఫ్,ఏఐఎస్ఎఫ్,ఎన్ఎఫ్ఐడబ్ల్యూ నాయకులు డిమాండ్ చేశారు. గాంధీ హాస్పిటల్లో మృతి చెందిన చిన్నారి ఘటనపై స్పందిస్తూన సీపీఐ, ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ నాయకులు శుక్రవారం మల్లాపూర్ ప్రభుత్వ హాస్పిటల్ ఎదుట వారు ఆందోళన చేపట్టారు. వివరాలిలా ఉన్నాయి. మల్లాపూర్ డివిజన్ సూర్యనగర్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మల్లాపూర్ బాబానగర్ కు చెందిన గుడిసె కవిత గురువారం మల్లాపూర్ సూర్య నగర్ లోని ప్రభుత్వ ఆసుపత్రికి డెలివరీ కోసం సాయంత్రం ఐదున్నర గంటలకు వెళ్ళింది. డ్యూటీలో ఉన్న డాక్టర్లు నిర్లక్ష్యంగా స్టాఫ్ నర్స్ తో డెలివరీ చేయించడంతో పాప మృతి చెందింది. సదరు డాక్టర్, స్టాఫ్ నర్సు నిర్లక్ష్యం కారణంగానే చిన్నారి మృతి చెందిందని ఆరోపిస్తూ,భాధ్యులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ ఆసుపత్రి ఎదుట సీపీఐ, ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్,ఎన్ఎఫ్ఐడబ్ల్యు ఉప్పల్ మండల సమితి సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, సీపీఐ ఉప్పల్ మండల కార్యదర్శి టి. సత్య ప్రసాద్ లు సంయుక్తంగా మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో డాక్టర్లు విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించడం మూలంగానే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయన్నారు. మల్లాపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో స్టాఫ్ నర్సు ఇప్పటివరకు 75కు పైగా డెలివరీలు చేశానని బాహాటంగా చెబుతుందంటే, ఈ ఆసుపత్రిలో డాక్టర్ సేవలు నిరుపయోగమనే భావన వ్యక్తం అవుతుందని ఆరోపించారు. చిన్నారి ఘటన విషయంలో స్టాఫ్ నర్సు అన్నీ తానై, డాక్టర్ కు సమాచారం ఇచ్చినా సమయానికి రాకపోవడంతో వల్లనే చిన్నారి మరణించిందని వారు ఆరోపించారు. ప్రజల పట్ల, పేషెంట్ల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఈ ఆసుపత్రికి సాధారణంగా మారిందని విమర్శించారు. చిన్నారి మృతి ఘటనపై జిల్లా వైద్యశాఖ అధికార యంత్రాంగం సమగ్రమైన విచారణ జరిపి, ఘటనకు కారకులైన డాక్టర్, స్టాఫ్ నర్సులను సస్పెండ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం, ఈ ఘటనపై విచారణ జరపడానికి ఆసుపత్రికి వచ్చిన మేడ్చల్ జిల్లా డిప్యూటీ వైద్యశాకాదికారి సత్యవతికి సంఘాల పక్షాన ఫిర్యాదు చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు శేఖర్,ఏఐఎస్ఎఫ్ నాయకులు అజీమ్ పాషా, మహిళా సమాఖ్య నాయకురాలు మేరీ, స్వర్ణ ,కావ్య,రాజు పాల్గొన్నారు.

## వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలి



వేముల వెంకటేష్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న ఏడుకొండలు, పీట్ల శ్రీధర్, వేముల రామకృష్ణ తదితరులు

**హైదరాబాద్, జూలై 11 ప్రభాతవార్త**

వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలని జాతీయ వడ్డెర సంఘం డిమాండ్ చేసింది. శుక్రవారం అత్తాపూర్‌లో జాతీయ వడ్డెర సంఘం ఆధ్వర్యంలో వేముల వెంకటేష్ సంతాప సభ జరిగింది. ఈ సభలో జాతీయ వడ్డెర సంఘం నేతలు ఏడుకొండలు, పీట్ల శ్రీధర్, వేముల రామకృష్ణ, మొగిలి, వల్లెపు శివ, పిట్ల గోపాల్, లక్ష్మీ కాంతయ్య, లోకనాథం, మారయ్య, వల్లెపు గణేష్ ,పల్లెకు, రమేష్, భవాని విజయలక్ష్మీ తదితరులు మాట్లాడారు. వడ్డెర్లను ఎస్టీ జాబితాలో చేర్చాడానికి రాజకీయాలకు అతీతంగా సంఘటితం కావాలని పిలుపు నిచ్చారు. విద్యా ఉద్యోగ రాజకీయపరంగా వెనుకబడిన ఒడ్డరులను ఎస్టీ జాబితాలో చేర్చాలని, అందుకు రాష్ట్రవ్యాప్త పర్యటనలు నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో 33 జిల్లాల ముఖ్య నాయకులు పాల్గొన్నారు. అంతకు ముందు వేముల వెంకటేష్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు.

## సాహిత్యాన్ని సర్వ జన హితం కోసం వాడిన సినారే : ఆచార్య కొలకలూరి ఇనాక్



ప్రఖ్యాత గీత రచయిత సుద్దాల అశోక్ తేజకి సినారె సాహితీ పురస్కారం ప్రదానం చేసిన దృశ్యం

**చిక్కడపల్లి, జూలై 11 ప్రభాతవార్త:** సాహిత్యం ను సర్వ జన హితం కోసం వాడిన సినారె గొప్ప కళా మూర్తి, చైతన్య స్పూర్తి, ఆధునిక సాహిత్య వైతాలికుడు అని శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యా లయం పూర్వ వైస్ ఛాన్సలర్ ఆచార్య కొలకలూరి ఇనాక్ కొనియాడారు. శనివారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభ ప్రధాన వేదిక పై ప్రముఖ సాంస్కృతిక సంస్థ రసమయి నిర్వహణ లో డాక్టర్ సి.నారాయణ రెడ్డి జన్మ దినోత్సవం సందర్భంగా ప్రఖ్యాత గీత రచయిత సుద్దాల అశోక్ తేజకి సినారె సాహితీ పురస్కార ప్రదానోత్సవ సభ నిర్వాహక సంస్థ అధినేత, ప్రముఖ కవి డాక్టర్ ఎంకె.రాము ఆధ్వర్యంలో జరిగింది ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆచార్య ఇనాక్ పురస్కారం బహుకరించి మాట్లాడారు. నిజాం భూస్వాములును దిక్కిరించిన కుటుంబ నేపధ్యం నుంచి వచ్చిన సుద్దాల అశోక్ తేజకు సినారె పురస్కారం బహుకరించటం సముచితంగా వుంది అన్నారు. సినారె సినీ కవి అందరికీ తెలిసిన వారు కాని ఆయన 87 కావ్యాలు రాసిన సాహితీ. మూర్తిగా ప్రపంచ సాహితీ కారులకు తెలుసు అన్నారు. అధ్యక్షత వహించిన తెలంగాణ సారస్వత పరిషత్ అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరీ శివా రెడ్డి మాట్లాడుతూ సినారె పాట రాయటం పాడటం తెలిసిన వారు అని అలాగే అశోక్ తేజ కూడా రచన గానం చేయ గల ప్రతిభ కల వారు అన్నారు. సినారె కు రసమయి రాము అగ్రగణ్య శిష్యుడు అని చెప్పారు. మాజీ కేంద్ర మంత్రి డాక్టర్ సముద్రాల వేణుగోపాలాచారి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమం లో పాల్గొన అశోక్ తేజకు సినారె పురస్కారం సముచితం అన్నారు. వేదిక పై డాక్టర్ చెన్నయ్య పాల్గొన్నారు డాక్టర్ రాము స్వాగతము పలు కుతూ అశోక్ తేజ నేను సైతం పాటకు జాతీయ అవార్డు అందుకున్న వారు అన్నారు. ఆశా లత వ్యాఖ్యానం లో రాము రచించిన సినారె మహాకవి నృత్య గీతానికి శృతి సమన్వ నాట్యం చేశారు.

## పేద, దళితులకు విద్యాధర్ విశేషమైన సేవలు



విద్యాధర్‌ను సత్కరిస్తున్న ్న పద్మారావు, వినయ్‌కుమాం

**సైఫాబాద్, జులై 11 ప్రభాతవార్త:** ఐఆర్ఎస్ అధికారిగా విశాఖపట్నం, హైదరాబాద్ నగరాల్లో విశేషమైన సేవలు అందించిన డా.జల్ది విద్యాధర్ సామాజిక, సాహిత్య రంగాలలోనే కాకుండా పేద, దళిత ప్రజలకు విశేషమైన సేవలు అందించారని ఆర్‌పిఐ తెలుగు రాష్ట్రాల చీఫ్ కో-ఆర్డినేటర్ టి.పద్మారావు, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కాడారం వినయ్‌కుమార్ కొనియాడారు. హైదరాబాద్‌లోని జిఎస్‌టి ఉప కమిషనర్‌గా పదవి విరమణ చేసిన విద్యాధర్‌ను శుక్రవారం వారు సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్.అంబేద్కర్ స్పూర్తితో సిద్దంత పరంగా కొనసాగుతూ ఎపి షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం, అంబేద్కర్ యువజన సంఘం కార్యక్రమాలను ఆయన పాల్గొంటు అని ్న వర్గాలకు వారికి, ఉద్యోగుల కు నిరంతరం సేవలు అందించారని వారు తెలిపారు. విద్యా ధర్ శేష జీవితం ప్రశాంతంగా కొనసాగాలని, భగవంతుడు ఆయనకు మంచి ఆరోగ్యాన్ని అందించాలని వారు కోరారు.

## తడి,పొడి చెత్తను వేరు చేసి ఆటోలకు ఇవ్వండి



హిమాయత్‌సాగర్ గ్రామంలో తడి,పొడి చెత్తపై మహిళలకు అవగాహన కల్పిస్తున్న కమీషనర్ శరత్‌చంద్ర.

### - బండ్లగూడ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర

**నార్సింగి, జూలై 11 ప్రభాతవార్త :** ప్రజలందరూ తమ ఇళ్లల్లోనే తడి,పొడి చెత్తలను వేరు చేసి ఆటోలకు ఇవ్వాలని బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ కమీషనర్ శరత్‌చంద్ర పేర్కొన్నారు. శుక్రవారం కార్పొరేషన్ పరిధిలోని హిమాయత్ సాగర్ గ్రామంలో మహిళలకు తడి,పొడి చెత్తపై కమీషనర్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడి చెత్తను వేరు చేసి ఇస్తే నేరుగా తీసుకెళ్లి సేంద్రీయ ఎరువులను తయారు చేస్తున్నామని, పొడి చెత్తను రీసైక్లింగ్‌కు ఇవ్వడం జరుగుతుందన్నారు. తడి,పొడి చెత్తలను కలిపి ఆటోలకు వేస్తే దాన్ని వేరు చేయడం కష్టతరంగా మారుతుందని, ప్రజలందరూ ఈ విషయంపై ప్రత్యేక శ్రద్ద వహించాలన్నారు. ఇళ్లల్లో రెండు టబ్బులు ఉంచుకొని తడి,పొడి చెత్తలను వేరు వేరుగా వేసి ఇళ్ల ముందుకు వచ్చే కార్పొరేషన్ ఆటోలకు ఇవ్వాలని సూచించారు. అనంతరం భూగర్భ డ్రైనేజి పనులను పరిశీలించారు. వర్షాకాలం కావడం వలన వరదలు వస్తాయని, నీరు సులువుగా దిగువ ప్రాంతాలకు వెళ్లేలా పారిశుద్య సిబ్బంది విధులు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఇఇ యాదయ్య, ఏఈఈ రాజ్ కుమార్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.



ముష్కిన్ చెరువు కట్ట పునర్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఇరిగేషన్ ఏఈ నరేంద్ర, నాయకులు మల్లేష్, రామకృష్ణారెడ్డిలు.

## ముష్కిన్ చెరువు పరిరక్షణకు ప్రత్యేక చర్యలు

### - ఇరిగేషన్ శాఖ ఏఈ నరేంద్ర

**నార్సింగి, జూలై 11 ప్రభాతవార్త :** నార్సింగిలోని ముష్కిన్ చెరువు పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఇరిగేషన్ ఏఈ నరేంద్ర పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక నాయకులతో కలిసి ఏఈ నరేంద్ర ముష్కిన్ చెరువు కట్ట వద్ద జరుగుతున్న పునర్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువులోకి మురుగు నీరు చేరకుండా ప్రత్యేక పైప్‌లైన్‌లు వేయిస్తామన్నారు. వరద నీటి కాలువలను కబ్జా చేస్తే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేష్ ముదిరాజ్, మణికొండ మాజీ ఫ్లోర్ లీడర్ కొండకళ్ల రామకృష్ణారెడ్డిలు మాట్లాడుతూ ఈ చెరువు స్థలం కబ్జాలకు గురవ్వకుండా ఇరిగేషన్ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. ఒకప్పుడు పంట పొలాలకు పారిన ఈ చెరువులోని నీరు నేడు భారీ అపార్టుమెంట్ల నుంచి వచ్చే డ్రైనేజి నీరుతో కలుషితం అవుతుందని, దాన్ని కలువకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాల న్నారు.



వంద రోజుల ప్రణాళికలో భాగంగా శుక్రవారం నార్సింగి మున్సిపల్ కమీషనర్ కృష్ణభగవాన్‌రెడ్డి ఆదేశాల మేరకు సిబ్బందికి ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యుల దృశ్యం.

## జంతు సంరక్షణ చట్టాలను అమలు చేయాలి

### -లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ చైర్మన్ ప్రేమ్‌చంద్ మునోత్ జైన్



ప్రేమ్‌చంద్ మునోత్ జైన్

**హైదరాబాద్, జూలై 11 ప్రభాతవార్త**

జంతు సంరక్షణ చట్టాలను సంవర్ధవంతంగా అమలు చేయాలని లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320డి ఎనిమల్ వెల్ఫేర్ చైర్మన్ ప్రేమ్‌చంద్ మునోజ్ జైన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ చైర్మన్‌గా ఎన్నికైన సందర్భంగా శుక్రవారం కాచిగూడలో ఆయన మీడియాతో మాట్లాడారు. జంతు సంరక్షణ చట్టాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కార్యక్రమాల రూపకల్పన చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ జంతువులను ప్రేమించాలని, జంతువుల అభివృద్ధికి కృషి చేసినప్పుడే మానవ జాతి మనుగడ సాధిస్తుందన్నారు. గోసేవలో భాగంగా గోవులకు మెడిసిన్, ప్రోటీన్స్, మినరల్ మిక్చర్ అందజేస్తున్నట్లు తెలిపా రు. నాగుల పంచమి రోజున పావులను కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. తన పరిధిలో ఉన్న వందకుపైగా లయన్స్ క్లబ్స్ ప్రతినిధుల సహకారంతో జంతు సంరక్షణకు కృషి చేస్తానని తెలిపారు.

## సూరారం పోలీస్ స్టేషన్ సిఐగా సుధీర్ కృష్ణ

**జీడిమెట్ల, జూలై 11, ప్రభాతవార్త**

సైబరాబాద్ పోలీస్ కమిషనర్ పరిధిలోని సూరారం పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా సుధీర్ కృష్ణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన భరత్ కుమార్ ట్రాఫిక్ విభాగానికి బదిలీ కాగా మేడ్చెల్‌లో పనిచేసిన సుధీర్ కృష్ణ బదిలీపై సూరారం పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ శాంతి భద్రత విషయంలో కఠినంగా వ్యవహరిస్తారని పేర్కొన్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి మెరుగైన సేవలందిస్తానని అన్నారు.

## మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం



సమావేశంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

**కొంపల్లి, జూలై 11, ప్రభాతవార్త**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని కొంపల్లి ఎస్ఎంఆర్ గార్డెన్స్‌లో మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేన రెడ్డి, ఎమ్.ఎల్. సి బస్వరాజు సారయ్య, బడంగ్ పేట్ మాజీ మేయర్ పారిజాత నరసింహారెడ్డి, కో ఆర్డినేటర్స్ శశికళ యాదవ రెడ్డి, గజ్జెల కాంతం, ఏపి మిథున్ రెడ్డిలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి, మాజీ టిపిసిసి ప్రధాన కార్యదర్శి నర్సా రెడ్డి భూపతి రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు సుధీర్ రెడ్డి, కూన శ్రీశైలం గౌడ్, నియోజకవర్గ ఇంచార్జులు బండి రమేష్, వజ్రేష్ యాదవ్, గ్రంథాలయ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి కార్యకర్తలు పాల్గొన్నారు.

## డెమోక్రసీ విలువలపై అవగాహన

**పేట్ బషీరాబాద్, జూలై 11, ప్రభాతవార్త**

యువ మనస్సులలో ప్రజాస్వామ్య విలువలను పాదుకొల్పడానికి ఒక జీవంతమైన కార్యక్రమంగా సెయింట్ ఆంథోనీ హై స్కూల్ సుచిత్ర, కొంపల్లి శాఖలు శుక్రవారం విద్యార్థుల ఎన్నికలను నిర్వహించాయి. ఈ కార్యక్రమంలో ఎకాడమిక్ డైరెక్టర్ ఎన్.ఆర్. సరిత, ప్రిన్సిపాల్ శర్మిలా క్రిస్టీ పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజాస్వామ్యం, సమానత్వం పౌర బాధ్యతల ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలియజేయడం జరిగింది. భారతదేశ ఎన్నికల వ్యవస్థ, పార్లమెంటరీ విధానం, ఓటు హక్కు యొక్క శక్తి గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. వాస్తవ ప్రపంచ ఎన్నికల మాదిరిగానే ప్రచారాలు, ఓటింగ్ బూత్, బ్యాలెట్ లెక్కింపు జరిగాయి. ఈ సందర్భంగా కార్యదర్శి ఎన్.పి. సుందర రాజు మాట్లాడుతూ ప్రజాస్వామ్యం అనేది కేవలం పాలనా వ్యవస్థ మాత్రమే కాదు, అది ఒక జీవన విధానం. ఇటువంటి కార్యక్రమాల ద్వారా, మన విద్యా ర్థులు తమ హక్కులు, బాధ్యతలను అర్థం చేసుకుని, జాతి నిర్మాణంలో భాగస్వాములు కావడానికి మేం ప్రయత్నిస్తున్నా మన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ప్రజాస్వామ్య సూత్రాలను పాటించి, దేశ నిర్మాణంలో తమ వంతు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.

## బిసి బంధువయా

(మొదటి పేజీ తరువాయి)

మహిళలు, తదితర సంఘాల నాయకులు చైతన్య కార్యక్రమాలు చేపడుతుండడం తనకు సంతోషాన్ని కలిగించిందన్నారు. త్వరలో మహిళా రిజర్వేషన్లు కూడా ప్రకటించబోతున్నట్లు తెలిపారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం కృషి చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ తదితరులకు ఎమ్మెల్యే ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ బీసీ సెల్ చైర్మన్ చంద్రశేఖర్, బీసీసేన నాయకులు కత్తి చంద్రశేఖర్, భాగ్యలక్ష్మీ, వరలక్ష్మీ, జలజ, స్రవంతి, గడ్డమీది రమేష్, సరస్వతి, అనురాధ, అరుణ, తంగిడిపల్లి శంకర్, సింధూర, మేకల వెంకటేష్, నర్సింలు, సౌజన్య, మమత, వసంత, హామీపల్లి సుదర్శన్, కాంగ్రెస్ నాయకులు కొంకళ్ల చెన్నయ్య, అగ్గనూరు విశ్వం, ఆగిర్యాల కృష్ణారెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, రఘు నాయక్, జూకారం చంద్రశేఖర్, బాలరాజు గౌడ్, దంగు శ్రీనివాస్ యాదవ్, జంగ నర్సింహులు, వీరేశం, కట్ట వెంకటేష్ గౌడ్, అన్నారం రాములు గౌడ్, చేగూరి రాఘవేందర్ గౌడ్, అన్నారం రఘు గౌడ్, అందె మోహన్, రావుల పెంటయ్య, జాంగారి రవి, గొధ మాధవులు యాదవ్, మానపాటి ప్రదీప్ కుమార్, బసప్ప, తూంపల్లి రాంచంద్రయ్య, మంగ తదితరులు పాల్గొన్నారు.

# బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడంహర్షణీయం



**పెద్దేముల్, జులై 11, ప్రభాతవార్త:** ఇచ్చిన మాట ప్రకారం సిఎం రేవంత్ సర్కార్ బీసీలకు 42 శాతము రిజర్వేషన్లు కల్పించడం హర్షనీయమని తాండూరుమార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షులు జీతేందర్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 42 శాతము రిజర్వేషన్లు కల్పించడంతో శుక్రవారం పెద్దేముల్ మండలకేంద్రంలో పార్టీ శ్రేణులు బాణసంచా కాల్చి మిఠాయిలు పంచిపెడుతు సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ నాడు,నేడుఇందిరమ్మ ఇండ్లు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తు ప్రజల హృదయాలలో చెరగని స్థానంసంపాదించిందని అన్నారు. అభివృద్ది, సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీవిజయదుందుబి మోగించాలని, అందుకు నాయకులు,కార్యకర్తలు సమిష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ మైనార్టీ కన్వీనర్ యండి.రియాజ్, జిల్లా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు శోభారాణి, జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.ఎల్లారెడ్డి, మాజీ యంపి టిసి మైపాల్‌రెడ్డి, పెద్దేముల్ గ్రామ కమిటిఅధ్యక్షుడు డివై నర్సిములు, మాజీ ఉపసర్పంచ్ గోపాల్‌కృష్ణ, నాయకులు కోహీర్ రవికిరణ్, రాము నాయక్, యండి. ఫయాజ్,బోయినిఅంజి, రవి నాయక్,కోళ్ళ గోపాల్, బ్యాగరి మల్లేశం,బ్యాగరి మల్లయ్య, కుమ్మరి సాయిలు, సాయిబాబా ,అంజనేయులు ,మొజం పాల్గొన్నారు.

## ఉరి వేసుకొని యువకుడి ఆత్మహత్య

**దోమ.జులై11 ప్రభాతవార్త:**చెట్టుకు ఉరివేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలో ఉట్‌పల్లి గ్రామ శివారులో శుక్రవారం నాడు జరిగింది.పోలిసులు తెలిపిన వివరాల ప్రకారం నారాయణపేట్ జిల్లా,కోస్గి మండలము,పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఏదుల మల్లేశ్ 21 (ఏకైక కుమారుడు)తోపాటు ఇద్దరు అక్కలు కలరు.మల్లేశ్ హైదరాబాద్‌లో ఉంటు స్విగ్గి,ర్యాపిడో కంపెనిల్లో డెలివరిబాయ్‌గా పనిచేసేవాడు.గతవారం క్రితం తన స్వంత గ్రామముకు వచ్చి తిరిగి హైదరాబాద్ వెళ్తున్నాని తన కుటింబికులకుచెప్పి ఈ నెల 9న ఇంటి నుండి బయలు దేరి,తన స్వంత వాహనంపై వెళ్ళినాడు.ఇంటి నుండి వెళ్ళినప్పటి నుండితన పోన్ కలవడం లేక పోవడంతో కుటింబికులు ఆందోళనకు గురయ్యారు.వాట్సప్ గ్రూపుల్లో మల్లేశ్ తన వాహనందోమ మండల పరిదిలోని ఉట్‌పల్లి గ్రామ శివారులో రోడ్డుకు కొంత దూరంలో ఉన్నదని షేర్ చేశారు.ఈ విషయముకుటింబికులకు తెలుపడంతో శుక్రవారం నాడు దోమ పోలిసులను ఆశ్రయించగా,ఉట్‌పల్లి గ్రామస్తులు,కుటుంబ సభ్యులుకలిసి చెట్లల్లో వెతకగా పెద్ద చెట్టుకు ఉరి వేసుకొని మృతి చెందినట్లు పోలిసులు తెలిపారు.మృతుని అక్క శివమ్మఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ ఆనంద్ తెలిపారు.

## రాష్ట్ర మంత్రిని కలిసిన దోకూరి ప్రభాకర్ రెడ్డి



**తలకొండపల్లి జులై11 ప్రభాతవార్త:**రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమా టోపోగ్రాఫ్ శాఖ మాత్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డిని శుక్రవారం నాడు తలకొండలపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దోకూరి ప్రభాకర్ రెడ్డి కలిశారు. కల్వకుర్తి నియోజకవర్గం లోని ఆయా మండలాలలో వివిధ అభివృద్ధి పనుల శంకుస్థాపనలు ప్రారంభోత్సవ కార్యక్రమానికి కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తో కలిసి ఆయన పాల్గొన్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దోకూరు ప్రభాకర్ రెడ్డి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని శాలువాతో కోమటిరెడ్డి వెంకటరెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించారు. కల్వకుర్తి నియోజకవర్గానికి అభివృద్ధి పనులకు అధిక నిధులు కేటాయించినందుకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ఈ సందర్భంగా ఆయన తెలిపారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కత్తిరెడ్డి నారాయణరెడ్డి కాంగ్రెస్ పార్టీ తలకొండపల్లి మండల అధ్యక్షులు దోకూరు ప్రభాకర్ రెడ్డి లు ఉన్నారు.

### పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణానికి 20,వేల ఆర్థిక సహాయం

**తలకొండపల్లి జులై11,ప్రభాతవార్త:**తలకొండపల్లి మండల పరిధిలోని తాళ్లగుట్ట తండాలో గల ప్రభుత్వ పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణానికి తలకొండపల్లి మాజీ జెడ్పిటిసి ఉప్పల వెంకటేష్ వ్యక్తిగతంగా 20వేల రూపాయలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన తండావాసుల తో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ప్రహరి గోడ నిర్మాణం లేక విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు గురవుతున్నట్లు తన దృష్టికి తేవడంతో వ్యక్తిగతంగా ఇవ్వవేల రూపాయల ఆర్థిక సాయం అందజేసినట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వం అన్ని రకాల మౌలిక వసతులు ప్రభుత్వం అన్ని రకాల మౌలిక వసతులు కల్పించాలని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఒక సంవత్సరం నర గడుస్తున్న ఇంకాఅనేక సమస్యలు మిగిలిపోయి ఉన్నాయని ఆయన అన్నారు. సర్పంచుల సంఘం మాజీ మండల అధ్యక్షులు గోపాల్ నాయక్, మాజీ సింగల్ విండో డైరెక్టర్ పాండు నాయక్, ఆర్య నాయక్ ,రఘునాయక్ ,శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## విద్యార్థులకు ప్లేట్లు,గ్లాసులు పంపిణీ



**కొడంగల్,జులై 11ప్రభాతవార్త:**కొడంగల్ పట్టణానికి చెందిన బాధ్యత స్వచ్ఛంధ సంస్థ అద్వర్యంలో మండలంలోని వివిధ గ్రామాల పాఠశాలలకు చెందిన విద్యార్థులకు ప్లేట్లు,గ్లాసులు,దుప్పట్లు వాటర్ క్యాన్లు పంపిణీ చేశారు.శుక్రవారంకొడంగల్‌పట్టణంలోనిసీపీఎస్ బాలుర,సీపీఎస్ ఇంద్రానగర్‌పాఠశాలలతో పాటు మండల పరిధిలోని గుండ్లకుంట, హుస్సేన్‌పూర్,భీమ్లీతండానాగారం,బోయతండా,ప్యాలమద్ది, బూల్కాపూర్, పాతకొడంగల్,ఎక్కచెర్వు తండాతదితరగ్రామాల్లోని పాఠశాలల విద్యార్థులకు ప్లేట్లు,గ్లాసులు,వాటర్ క్యాన్‌లు, దుప్పట్లు పంపిణీ చేశారు.ే సంస్థ సభ్యులు కట్కం వెంకటేష్,కిట్టుస్వామి,దుబ్బస్ క్రిష్ణారావు ,లక్ష్మీనారాయణ జ్యోషి, బాలరంగాచారీ, నగేష్,వేణు,కానుకుర్తి రమేష్ ు పాల్గొన్నారు.

### గట్టు ఇలపల్లి గ్రామ కార్యదర్శి అనిత సస్పెండ్

**తలకొండపల్లి జులై 11, ప్రభాత వార్త** :రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండల పరిధిలోని గట్టు ఇప్పలపల్లి గ్రామానికి చెందిన గ్రామ కార్యదర్శి అనిత శుక్రవారం నాడు సస్పెండ్ కు గురయ్యారు. షాబాద్ మండలం నుంచి డిప్టేషన్ పై గట్టు ఇప్పలపల్లి గ్రామానికి కార్యదర్శిగా వచ్చిన అనిత గత మూడు నెలలుగా కార్యదర్శిగా విధులు నిర్వర్తించింది. ఇటీవల గ్రామపంచాయతీ ట్రాక్టర్లకు డీజిల్ కొరతతో గ్రామంలోని చెత్తను తరలించే ట్రాక్టర్లను గ్రామపంచాయతీ సిబ్బంది నిలిపివేయడంతో ఆగ్రహించిన ఉన్నతాధికారులు శుక్రవారం నాడు జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి అనితను సస్పెండ్ చేశారు.

# కాంగ్రెస్ రైతు వ్యతిరేక ప్రభుత్వం... మాజీ ఎమ్మెల్యే



**తలకొండవల్లి జులై 11,ప్రభాతవార్త,,.** తెలంగాణలో కాంగ్రెస్.రాష్ట్ర ప్రభుత్వము ఏర్పడి 18 నెలలు కావస్తున్న ఎక్కడి గొంగడి అక్కడే ఉందని. రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ తెలంగాణ రైతాంగానికి తీరని అన్యాయం చేస్తుందని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ అన్నారు. శుక్రవారం తలకొండపల్లి పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆయన విలేకరుల నమావేశంలోమాట్లాడుతూకల్వకుర్తి నియోజకవర్గం లోని మాడ్గుల్. వెల్దండ. కల్వకుర్తి నియోజకవర్గం మంత్రులు పర్యటన సందర్భంగా గట్టు ఇప్పలపల్లి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నాయకులను అర్ధరాత్రి అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు దీనికి నిరసనగా కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ ,కల్వకుర్తి మున్సిపల్ మాజీ చైర్మన్ ఎడమ సత్యం,మాజీ జెడ్పిటిసిలు. దశరథ్ నాయక్,పత్యా నాయక్,విజితా రెడ్డి, అమంగల్ మాజీ మార్కెట్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి,త లకొండపల్లి మాజీ సర్పంచ్ లలిత జ్యోతయ్య సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షులు గోపాల్ నాయక్ లుపోలీస్ స్టేషన్ కు చేరుకొని నిరసన వ్యక్తం చేశారు. అక్రమంగా అరెస్టులు చేయడమేందని వారు ప్రశ్నించారు. ఎక్కడో ప్రారంభోత్సవాలు శంకుస్థాపనలు చేస్తే ఇక్కడ అరెస్టులు చేయడం ఏంటి అని వారు అన్నారు. ఈరోజు మంత్రులు చేసే శంకుస్థాపనల్లో టిఆర్ఎస్ హయాంలోనే వంద పడకల ఆసుపత్రి. రోడ్ల నిర్మాణానికి మరియు మాడుగుల అభివృద్ధికి. ఆమనగల్ అభివృద్ధికి ఇటోదికంగా నిధులు తీసుకువచ్చి అభివృద్ధిపరిచామని ఈ ప్రభుత్వం మాత్రం మాటలతో పబ్బం గడుపుతుందని ఆయన అన్నారు.

కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు. తట్టా మట్టి ఎత్తిపోయే లేదని. ఒక ఎకరానికి నీరు అదనంగా ఇవ్వలేదని రైతులు ఉసురు పోసుకుంటుందని మాజీ ఎమ్మెల్యే అన్నారు. నల్లమల్ల ముద్దుబిడ్డ. కల్వకుర్తి ముద్దుబిడ్డ అని చెప్పుకునే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. నిజంగా ఈ ప్రాంతం మీద ప్రేమ ఉంటే. పాలమూరు రంగారెడ్డి కి నిధులు కేటాయించి వెంటనే పనులు చేపట్టే ఈ ప్రాంతాన్ని చేయాలని వారు డిమాండ్ చేశారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కాశిరెడ్డి నారాయణరెడ్డి ఎన్నికలకు ముందు గట్టిపల్లె పెల్లి గ్రామాన్ని మండలం గా చేస్తానని అప్పట్లో హామీ ఇచ్చారని ఎమ్మెల్యే గెలిచిన తర్వాత మాట మర్చిపోయారని ఆయన అన్నారు. రుణమాఫీ సగం మందికి మాత్రమే రైతు భరోసా సంఘం మందికి రైతులకు మాత్రమే ఇచ్చి రైతులను మోసం చేసిందని ఆయన అన్నారు .

ఇప్పటికైనా ఇచ్చిన హామీలు కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చి ఈ ప్రాంత రైతాంగాన్ని మరియు ప్రజల నాదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్. జయమ్మ వెంకటయ్య. నాయకులు చంద్రశేఖర్ రెడ్డి. ఢిల్లీ కృష్ణయ్య. శరత్చంద్ర. శ్రీశైలం. రమేష్.జోగు వీరయ్య పాండు నాయక్ శేఖర్ నరోతం రెడ్డి. బాల కుమార్ గౌడ్. ఆంజనేయులు. శేఖర్ యాదవ్. టిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## పోతుల వాగు పరిశీలించిన విజిలెన్స్ డిఎఫ్ఓ

**ధారూరు, జులై 11, ప్రభాతవార్త:** మండల పరిధిలోని అల్లాపూర్ గ్రామ శివారులో ఉన్న పోతుల వాగు ను శుక్రవారం విజిలెన్స్ డి.ఎఫ్.ఓ రాజశేఖర్ పరిశీలించారు. గత కొన్ని రోజులుగా పోతుల వాగులు కబ్జా అయినట్లు పత్రికలలో వచ్చిన వార్తకు విజిలెన్స్ డి ఎఫ్ స్పందించి సందర్శించారు. అల్లాపూర్ ఎఫ్ బ్లాక్ సర్వేనెంబర్ 11 లో అటవీ హద్దుల ు గుర్తించి, అటవీ ప్రాంతం గెజిట్ ప్రకారం 97 ఎకరాలు 39 గుంటలు ఉండాలని చెప్పారు. సర్వే కోసం జిల్లా సర్వే అధికారి నివేదిక పంపడం జరుగుతుందని తెలిపారు. జాయింట్ సర్వే ఆయన తర్వాత ఎన్ని ఎకరాలు కబ్జాకు గురైన తేలుతుందని అన్నారు. ఆయనతోపాటు ధారూర్ ఎఫ్ఆర్ఓ రాజేందర్, గ్రామస్తులు, ఫారెస్ట్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## సిఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం

**పరిగి జులై 11 ప్రభాతవార్త** : స్థానిక సంస్థల్లో బిసిలకు 42 రిజర్వేషన్ల




అమలుకు ప్రభుత్వం నుండి ప్రకటన రావడంతో పరిగి లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో డిసిసి అధ్యక్షులు, పరిగి ఎమ్మెల్యే డా టి. రామ్మోహన్ రెడ్డి, టిపిసిసి ఉపాధ్యక్షులు బొంతు రామ్మోహన్ ఆధ్వర్యంలో బిసి నాయకులతో కలిసి లోక్ సభా పక్ష నేత రాహుల్ గాంధీ, సిఎం రేవంత్ రెడ్డి, టిపిసిస అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ మరియు బిసి సంక్షేమ సంఘం మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు....ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి బీసీ డిక్లరేషన్ లో భాగంగా ఇచ్చిన హామీ ప్రకారం స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ ఇస్తామని ప్రకటించడం జరిగిందని, దానికి అనుగుణంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ క్యాబినెట్ లో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆర్డినెన్సు ద్వారా 42 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని నిర్ణయించడం కాంగ్రెస్ పార్టీ గొప్పతనమని తెలిపారు.. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు, బ్లాక్ అధ్యక్షులు , బిసి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## జనాభాపై అందరికీ అవగాహన అవసరం




**షాబాద్, జులై 11, ప్రభాతవార్త:** జనాభా సమస్యలు, ఆవశ్యకత, ప్రాముఖ్యతపై ప్రతి ఒక్కరికి అవగా హన అవసరమని చందనవెల్లి ప్రభుత్వ ఆసుపత్రి అధికారి డాక్టర్ ప్రణీత్ అన్నారు. అంతర్జాతీయ జనాభా దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం చందన వెల్లి ప్రభుత్వ ఆసుపత్రి ఆధ్వర్యంలో వైద్య సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశం అభివృద్ధి, పర్యావరణం, సమాజ సంబంధాలు, జనాభా పైనే ఆధారపడి ఉంటాయని అన్నారు. జనాభా పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది నవీన్ గౌడ్, నవీన్, గోపాల్, స్టాఫ్ నర్స్ లు, ఆశా వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా ప్రపంచ జనాభా దినోత్సవం




షాద్‌నగర్, ప్రభాతవార్త, (జులై11) : పరిధికి మించిన జనాభా ఉంటే అక్కడ అభివృద్ధి జరగడం కష్టమవుతుందని, ఎన్నో అంశాల్లో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని, ప్రకృతి వనరులు కూడా సరిపోవనే విషయాన్ని ప్రజలకు చేరవేస్తూ కుటుంబ నియంత్రణ ఎంత ముఖ్యమో వివరిస్తూ ప్రపంచ జనాభా దినోత్సవాన్ని షాద్‌నగర్ వైద్య సిబ్బంది నిర్వహించారు. షాద్‌నగర్ డివిజన్ డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మీ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రి నుండి పట్టణ కూడలి వరకు వైద్య సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించి, చౌరస్తాలో మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయలక్ష్మీ మాట్లాడుతూ జనాభా పెరిగితే వచ్చే సమస్యలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. 1989లో యునైటెడ్ నేషన్స్ ద్వారా ప్రపంచ జనాభా దినోత్సవాన్ని ప్రారంభించారని, ప్రతి ఏడాది జులై 11న నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మేము ఇద్దరం మాకు ఒక్కరు అనే నినాదంతో ప్రతి ఒక్కరు కుటుంబ నియంత్రణ కార్యక్రమాన్ని ప్రోత్సహించాలని ఆమె సూచించారు. జనసంఖ్య నియంత్రణ అవసరం, కుటుంబ సంక్షేమం, లింగ సమానత్వం, వనరుల పరిరక్షణ వంటి అంశలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది డాక్టర్ స్రవంతి, డాక్టర్ రాఘవేందరన, ఎంఎల్‌హెచ్‌పీ వైద్యాధికారులు డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ బిందు, బూర్గుల పీహెచ్‌సీ మహేశ్వరి, హెల్త్ సూపర్‌వైజర్లు అమృత, శ్రీరామ, చంద్రకళ, హెల్త్ అసిస్టెంట్ రెడ్డి, సిబ్బంది రవికుమార్, గౌస్, లింగం, ఏఎన్ఎంలు, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

## మంచ్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం

**-- 210మందికి వైద్య పరీక్షలు**



**తాండూరు, జులై 11, ప్రభాతవార్త:** : మార్వాడి యువమంచ్ ఆధ్వర్యంలో శుక్రవారం తాండూరులో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పట్టణంలోని బాలాజి మందిర్‌లో స్టార్ హస్పిటల్ నా న క్ రా ం గ్ డా సహకారంతో ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం 3-30గంటల వరకు నిర్వహించిన వైద్య శిబిరంలో సుమారు 210మందికి వైద్య పరీక్షలు నిర్వహించడం జరిగిందని మంచ్ ప్రతినిధులు వెల్లడించారు. తాండూరు పట్టణంతో పాటు వివిద గ్రామాల నుండి ప్రజలు రావడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచ్ అధ్యక్షులు అనిల్ సారడా, కార్యదర్శి సచిన్ రాఠి, క్యాంప్ చైర్మన్‌లు దిపక్ బూబ్, అంకిత్ సారడా, మాధవ పర్తాని, క్రిష్ణాబూబ్, దినేష్ పసారి, దిపక్ సోని, దినిష్ పర్తాని, అశిష్ సారడా, బ్రిజ్ మోహన్ బూబ్, సన్ని అగ్రవాల్, లక్ష్మినారాయణ బూబ్, కుంజ్ బిహరిసోని, దిపక్ గగరాణి, మహేష్ సారడా పాల్గొన్నారు.

## .సీజనల్ వ్యాధుల నియంత్రణకు జాగ్రత్తలు పాటించాలి.

**.దుద్యాల్,జులై11, ప్రభాతవార్త:**



ప్రతి శుక్రవారం పొడిదినంగా పాటించాలని దుద్యాల గ్రామస్థులకు కొడంగల్ సబ్ యూనిట్ అధికారి పకీరప్ప, ఆరోగ్య సిబ్బందితో కలిసి అవగాహన కల్పించారు.మండల కేంద్రంలో ఇంటింటికి తిరిగి డ్రైడే మరియు ఫ్రైడే లో భాగంగా గ్రామ ప్రజలకుకాల నుగుణంగా సంక్రామించే వ్యాధులు డెంగీ, మలేరియా, చికెన్ గునియా, టైఫాయిడ్, నీళ్ల వీరేచనాలు మొదలగు వ్యాధులపై అవగాహన కలిగి ఉండి అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలోఆరోగ్య కార్యకర్త రాములమ్మ, ఆశా వర్కర్స్ సరిత, పద్మ, ఎల్లమ్మ పాల్గొన్నారు.

# ఘనంగా రాధాకృష్ణ ఐదవ వర్థంతి వేడుకలు

### ట్రస్టుసేవలు అభినందనీయం

**మాజీ ఎమ్మెల్యేలు జైపాల్ యాదవ్, అంజయ్య యాదవ్**

**కడ్తాల్, జులై11,ప్రభాతవార్త :** కడ్తాల్ మండల కేంద్రంలో జర్పుల రాధాకృష్ణ ఐదవ వర్ధంతిని వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాధాకృష్ణ వర్ధంతి సందర్భంగా ట్రస్ట్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారు. ట్రస్ట్ వ్యవస్థాపకుడు జర్పుల దశరథ్ నాయక్ మాట్లాడుతూ -తన కుమారుడిని "ట్రస్ట్ సేవల రూపంలో ప్రజల గుండెల్లో చూసుకుంటున్నానని తెలిపారు. ప్రత్యేకంగా బడుగు, బలహీన వర్గాల కోసం ట్రస్ట్ నిబద్ధతతో పనిచేస్తోందని తెలిపారు.ప్రజల మొహాల్లో ఆనందాన్ని చూస్తే తన కొడుకు బతికే ఉన్నాడని అనిపిస్తుందని తెలిపారు. తన కుమారుని పేరు మీద అనేకమంది బడుగు బలహీన వర్గాలకు సహాయం చేస్తుంటే ఇది తనకు గర్వకారణం, అని పేర్కొన్నారు. తన కుమారుడి ఐదో వర్ధంతి సందర్భంగా శుక్రవారం కడ్తాల్ మండల కేంద్రంలో ఇటీవల మరణించిన 137 మృతుల కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి 5000 రూపాయలు చొప్పున 6 లక్షల 85000 ఆర్థిక సాయం అందించారు.ట్రస్ట్ పేద మైనారిటీ విద్యార్థుల విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తోందని తెలిపారు. కడ్తాల్ మండల కేంద్రానికి చెందిన పాషా హసీనా దంపతుల కుమారుడి చదువుల కోసం రూ.2,75,000 ఖర్చుతో పదో తరగతి వరకు విద్యను ట్రస్టు ద్వారా ఉచితంగా అందిస్తున్నామన్నారు. ఇటీవల ఆలయ అభివృద్ధికి దృష్టి సారించిన ట్రస్ట్, గానుగమర్ల తండ గ్రామపంచాయతీ పరిధిలోని కానుగుబాయి తండాలో తుల్జా భవాని ఆలయ నిర్మాణానికి రూ.51,000 విరాళంగా అందించగా, ముద్విన్, రానుంతల గ్రామాల్లో పెద్దమ్మ, తుల్జా భవాని ఆలయానికి చెరో రూ.25,000 25 వేల చొప్పున 50,000 వేల రూపాయల విరాళాన్ని అందజేశారు.ప్రజల



సంక్షేమం కోసం పని చేస్తున్న ఈ ట్రస్ట్ సేవలు ప్రశంసనీయమని మాజీ ఎమ్మెల్యేలు జైపాల్ యాదవ్, అంజయ్య యాదవ్‌లు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు జైపాల్ యాదవ్, అంజయ్య యాదవ్, ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి, కల్వకుర్తి మాజీ మున్సిపల్ చైర్మన్ ఎద్మ సత్యం, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ ఈటా గణేష్, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, గోవర్ధన్ మాజీ మార్కెట్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, విజయ్ కుమార్, జెడ్పిటిసి విజిత రెడ్డి, అనురాధ పత్య నాయక్, గౌని లాలయ్య గౌడ్, జోగు వీరయ్య, మాజీ సర్పంచులు,ఎంపిటిసిలు,మండలనాయకులు ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

# మొక్కలు నాటి సంరక్షించాలి: కమిషనర్

## -దోమలనివారణపై అవగాహన



**ఘట్‌కేసర్, జులై 11,ప్రభాతవార్త:** వనమహోత్సవంలో ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని ఘట్‌కేసర్ మున్సిపల్ కమిషనర్ పంజాల రాజేశ్‌గౌడ్ అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపల్ మేడపాటినగర్‌లో శుక్రవారం వనమహోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా కమిషనర్ రాజేశ్‌తో పాటు అధికారులు, సిబ్బంది, సంస్కృతి కళాశాల విద్యార్థులు పాల్గొని కాలనీలో రోడ్ల వెంట మొక్కలు నాటి నీరు పోశారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటడం ద్వారా చెట్లు పెరిగి వాతావరణ కాలుష్యాన్ని నివారించవచ్చని కమిషనర్ రాజేశ్ పేర్కొన్నారు. మొక్కలను సంరక్షించడం వల్ల గాలి, నీరు శుభ్ర పడతాయని, ఉష్ణోగ్రత తగ్గుతుందని, నేల కోతను తగ్గిస్తుందని, వన్యప్రాణులకు ఆవాసం ఏర్పడుతుందని ఆయన తెలిపారు. బ్యానర్లు ప్రదర్శిస్తూ విద్యార్థులు పోటోలు దిగడానికి పోటీపడ్డారు. అనంతరం ఇడబ్ల్యుఎస్‌కాలనీ కూడలి వద్ద దోమల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. వర్షాకాలంలో దోమల తీవ్రత ఎక్కువగా ఉండే ఆస్కారముందని తగిన జాగ్రత్తలు పాటించడంతో పాటు ఇంటి పరిసరాలను పరిశ్రుభంగా ఉంచుకోవాలని,పాతటైర్లలో, బకెట్లలో నీటి నిల్వ ఉండకుండా చూసుకోవాలని కమిషనర్ సూచించారు.

ఈకార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ వేణుగోపాల్‌రెడ్డి, ఏఈ రాకేశ్, వార్డు అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**ఘట్‌కేసర్, జులై 11, ప్రభాతవార్త:** వర్షాకాలం దృష్ట్యా చేపడుతున్న మరమ్మత్తు పనులు, కరెంట్ తీగల కింద చెట్లకొమ్మల తొలగింపు, కొత్త సేవల విడుదల, డిసి పనుల కారణంగా శనివారం పలు చోట్ల విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నామని ఘట్‌కేసర్ టిజిఎస్‌పిడిసిఎల్ ఏఈ బి.యశ్వంత్‌కుమార్ తెలిపారు. 11 కెవి అవుషాపూర్ ఫీడర్ పరిధిలోని అవుషాపూర్‌లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కరెంట్ ఉండదని, 11 కెవి బాలాజీనగర్ ఫీడర్ పరిధిలోని బాలాజీనగర్‌లో ఉదయం 11 గంటల నుంచి 11:30 గంటల వరకు, 11 కెవి హెచ్‌పిసిఎల్ ఫీడర్ పరిధిలోని హెచ్‌పిసిఎల్, విబిఐటీ కళాశాల ప్రాంతంలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని వినియోగదారులు గమనించి తమకు సహకరించాలని ఏఈ కోరారు.

## కార్మికులకు మున్సిపల్ జీతాలు చెల్లించాలని వినతి

**ఘట్‌కేసర్, జులై 11, ప్రభాతవార్త:** పాత గ్రామపంచాయతీలలో పని చేసి మున్సిపాలిటీలో విలీనమైనప్పటికి కార్మికులకు పాత వేతనాలే ఇస్తున్నారని మున్సిపాలిటీ చట్టప్రకారం జీతాలు పెంచాలని సీఐటియు నాయకులు, కార్మికులు ఘట్‌కేసర్ మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామాలు విలీనమై 8 నెలలు గడుస్తున్నా మున్సిపాలిటీ జీతాలు రావడం లేదని పక్కనే ఉన్న పోచారం మున్సిపాలిటీలో వారం క్రితమే మున్సిపల్ జీతాలు రూ.16,500లు ఇస్తున్నారని తెలిపారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీలలో విలీనమైన గ్రామపంచాయతీ వర్కర్లకు కూడా కనీస వేతనం పెంచేవిధంగా చొరవ చూపాలని కోరారు. కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, 8 నెలల ఎరియర్స్ కూడా ఇవ్వాలని వారు కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. చింతల యాదయ్య, ఎన్.సబిత, లక్ష్మి, పద్మ, గణేశ్, జయమ్మ, శారద, కవిత తదితరులు పాల్గొన్నారు.

### కలెక్టర్ ఆకస్మిక పర్యటన..



**దుద్యాల్, జులై 11, ప్రభాతవార్త:** జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ శుక్రవారం దుద్యాల్ మండలంలో ఆకస్మికంగా పర్యటించి పలు అభివృద్ధి పనుల ు పరిశీలించారు. హకీంపేటలో నూతనంగా ప్రారంభించిన ఇంటర్మీడియట్ కళాశాల తరగతి గదుల ు, కళాశాల నిర్మాణ ప నుల ు, పోలేపల్లి శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయం అభివృద్ధిలో భాగంగా చేపడుతున్న ప నుల ు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జూనియర్ కళాశాల విద్యార్థుల ను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ, దుద్యాల ప్రాంత విద్యార్థుల సౌకర్యార్థం జూనియర్ కళాశాల ు స్థాపించడం జరిగిందన్నారు. ప్రతి విద్యార్థి శ్రద్ధ, నిబద్ధత, క్రమశిక్షణతో విద్య ను అభ్యసించాలని అన్నారు. ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మంచి ఫలితాలు సాధించి ఉన్నత చదువులు చదివే దిశగా తమ అడుగులు వేయాలని సూచించారు. విద్యార్థుల భవిష్యత్తు ఉన్నతంగా తీర్చిదిద్దే దిశగా తన వంతు కృషి చేస్తానని కలెక్టర్ తెలిపారు. ఎంసెట్, ఐఐటి, నీట్ పరీక్షలకు గా ను శిక్షణ తరగతుల ు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. హకీంపేటలో ూతనంగా నిర్మిస్తున్న జూనియర్ కళాశాల భవనాన్ని, పోలేపల్లిలోని శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయం అభివృద్ధిలో భాగంగా చేపడుతున్న ప నుల ు పరిశీలించి నాణ్యత ను పాటిస్తూ ప నులు వేగవంతం చేయాలని కలెక్టర్ తెలిపారు.అనంతరం శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన కలెక్టర్ కు ఆలయ కమిటీ సభ్యులు శాలువాలతో సన్మానం చేశారు. కలెక్టర్ పర్యటనలో ఆలయ కమిటీ చైర్మన్ జయరాం, ఈవో రాజేందర్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

### రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు సరఫరా

**శామీర్‌పేట్, జులై 11, ప్రభాతవార్త:** రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించేందుకు చర్యలు తీసుకోవాలని సహకార సంఘం చైర్మన్ రామిడి మధుకర్‌రెడ్డి అన్నారు. శామీర్‌పేట్ రైతు సేవా సహకార సంఘంలో శుక్రవారం మధుకర్‌రెడ్డి అధ్యక్షతన అభివృద్ది కార్యక్రమాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. రైతులకు నాణ్యమైన విత్తనాలు, పురుగుల మందులు, ఎరువులు అందించడం, వివిధ దశల్లో రైతులకు దిగుబడిపై సలహాలు, సూచనలు ఇస్తూ మార్కెట్ సౌకర్యం కల్పించడంపై చర్చించారు. ఫాంరైస్ వన్ ద్వారా జరుగుతున్న విషయాలపై అన్నిటిపై నాబార్డ్ బృందం పూర్తి స్థాయిలో స్టడీ చేయడం, అందిస్తున్న సేవలను అన్ని సహకార సంఘంలో ప్రారంభించే విధంగా భవిష్యత్తులో రైతులకు ఇంకా మెరుగైన సేవలను అందించడం కోసమే ఈస్టడీని నిర్వహించినట్లు తెలిపారు.నాబబార్డ్ జీఎంలు రాజమోహన్, అజయ్‌కుమార్‌గుప్తా, మేనేజర్ బెంజమెన్, టిఎస్‌సిఎబి అధికారులు, డిసిసిబి అధికారులు, ఫాంరైస్‌వన్ ప్రతినిధులు, సంఘం వైఎస్‌చైర్మన్, డైరక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు ఆబ్కారి స్టేషన్ ప్రారంభం

**వికారాబాద్, జులై 11, ప్రభాతవార్త ః** ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ భవనాన్ని ప్రారంభించనున్నట్లు

జిల్లా మధ్య నిషేధ, ఆబ్కారీ అధికారి కె.విజయభాస్కర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిదిగా వికారాబాద్ శాసన సభాపతి, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు, ఎక్సైజ్ శాఖ కమిషనర్ హరికిరణ్ హాజరవుతారని తెలిపారు.

**LOSS OF DOCUMENTS**

**I, NAGARAM UMA DEVI,** W/o. Sai Reddy, H.No. 4-1-698/32, Situated at Singarapu Rachaiah Colony, Vikarabad Municipality, Vikarabad Dist, T.G., I Lost My House/Plot documents vide Reg. Sale Deed Doc. No. **2843 / 2004** registered at SRO Vikarabad, Dated 29.12.2024 in respect of **Plot No. 32,** in **Sy.No.108** admeasuring **305.55 Sq.Yards/255.47 Sq.Meters** with document **I.P. No. 600/85,** while travelling from Ebbanoor Village, Dharur village, Vikarabad district. if anybody found pls contact above address.

## కళాశాల సేవలనుసద్వినియోగం చేసుకోండి



**నవాబుపేటజూలై11,ప్రభాతవార్త:** ప్రభుత్వ కళాశాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఇంటర్ మిడియట్ బోర్డు అధికారి శంకర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూపీయర్ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు. అధ్యాపకులతో కళాశాల పనితీరుపై ఆరాదీశారు. కళాశాలలో విద్యావంతులైనా అధ్యాపకులు ఉన్నారని వారి సేవలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. అన్ని గ్రూపుల్లో ఆంగ్ల మాధ్యమంలో భోదన కొనసాగుతున్నదని విద్యార్థులు ఈ సదావకాశాన్ని వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులకు వివిధ పోటి పరీక్షలకు సంబంధించిన భోదన కూడా అంధిత స్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ కళాశాల విద్యార్థులకు పేరొందిన కళాశాలలో ఫీజు రియాంబర్‌మెంట్ లభిస్తుందని చెప్పారు. అనంతరం పలు రికార్డులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్స్‌పాల్ సురేశ్వరస్వామి, కొడంగల్ ప్రిన్స్‌పాల్ నర్సింహరెడ్డి, సిబ్బంది పాల్గోన్నారు. ఫోటోరైటప్.ఏజిఎల్2. ఆమనగల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో మాట్లాడుతున్న చారగొండ వెంకటేశ్

## రాష్ట్రంలో ప్రభుత్వ బడులు బలోపేతం

### -రాష్ట్ర విద్యాకమీషన్ సభ్యుడు చారగొండ వెంకటేశం



**ఆమనగల్లు, జూలై11, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం, విద్యా ప్రమాణాల పెంపొందించేందుకు అవసరమైన చర్యలను వేగవంతంగా తీసుకుంటుదని రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యుడు చారగొండ వెంకటేశ్ అన్నారు. విద్యారంగంలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ముందుకు సాగుతుందని ఆయన పేర్కొన్నారు. ఆమనగల్లు మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలను శుక్రవారం చారగొండ వెంకటేశ్ ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలలో జరుగుతున్న అసెంబ్లీ ( ప్రార్థన)నలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆయన విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడి పలు అంశాలను అడిగి తెలుసుకున్నారు. క్రమశిక్షణతో మెలుగుతూ ఉన్నత శిఖరాలు, ఆశయాలను చేరుకోవాలని ఆయన విద్యార్థులకు సూచించారు. అనంతరం అదే ప్రాంగణంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. కళాశాల నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గత వార్షిక ఫలితాలలో సాధించిన విజయాలను కళాశాల ప్రిన్సిపాల్ మాధవరావు వివరించారు. అలాగే ప్రధానంగా ఎదురవుతున్న భవన సమస్యను కమిషన్ సభ్యుడికి వివరించారు.కళాశాల సదుపాయాలు మెరుగుపరిస్తే మరిన్ని విజయాలు సాధిస్తామని ప్రిన్సిపాల్ ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అధ్యాపక బృందం జైపాల్, ఆకుల కృష్ణయ్య, మాలతి, కుసుమలత, బాల్‌లింగయ్య తదితరులు ఉన్నారు. ఫోటోరైటప్.ఏజిఎల్3. ఆమనగల్లు ప్రభుత్వ ఆసుపత్రిలో రికార్డులు పరిశీలిస్తున్న డిఎంహెచ్ఓ డాక్టర్ వెంకటేశ్వరరావు

## ఆసుపత్రిని సందర్శించిన డిఎంహెచ్ఓ



**ఆమనగల్లు, జూలై11, ప్రభాతవార్త:** వైద్య,ఆరోగ్యశాఖ జిల్లా అధికారి డాక్టర్ వెంకటేశ్వరరావుశుక్రవారం ఆమనగల్లు ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించారు. ఆసుపత్రి పనితీరు, సిబ్బంది, రోగుల సేవలను ఆయన పరిశీలించారు. అక్కడే ఉన్న రోగులతో మాట్లాడి ఆసుపత్రిలో అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రభుత్వ పరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే అక్కడే నిర్మాణంలో ఉన్న నూతనభవనంగురించి అడిగి తెలుసుకున్నారు. ప్రతిఒక్కరూ సమయపాలన పాటించి రోగులకు సేవలందించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్లు మంజులాదేవి,నాగరాజు,మైమునబేగం,జయశ్రీ,సూపర్‌వైజర్ తిరుపతిరెడ్డి, ఆప్తమాలజిస్టు చంద్రశేఖర్, సునీత, వేణు, నాగేశ్వరి, యేసుమని, ఇందిరా, ఇతరులు ఉన్నారు.

## మర్పల్లి సంతలో ఇబ్బందులు పడుతున్న ప్రజలు

**మర్పల్లి జూలై11ప్రభాతవార్త :** మర్పల్లి మండలకేంద్రంలో ప్రతి మంగళవారం నాడు సంత జరుగుతుందిపలు గ్రామాల నుండి ప్రజలు సంతాకు వస్తారు సంతా జరిగే ప్రాంతంలో మూత్రశాలలు లేకపోవడంతోసంతాకు వచ్చిన వారు,ప్రయాణికులు,వ్యాపారవేతలు,ముఖ్యంగా మహిళలు, పలు ఇబ్బందులు పడుతున్నారు.బస్టాండ్‌లో సైతం మరుగుదొడ్ల మూత్రశాలు, లేకపోవడంతో ప్రయాణికులు,మహిళలు బాధలు వర్ణనా తీతంగామారాయి. మర్పల్లి బస్టాండ్‌లో,సంతలో మరుగుదోడ్లు, మూత్రశాలు ఎర్పాటు చేయాలని ప్రజలు ప్రయాణీకులు కోరుతున్నారు.

## నిరుపయోగంగా మారిన బిఎస్ఎన్ఎల్ కార్యాలయం

**మర్పల్లి జూలై11ప్రభాతవార్త:** మర్పల్లి మండల కేంద్రలో నిర్మించిన బిఎస్ఎన్ఎల్ కార్యాలయం ఆలన లేక నిరుపయోగంగా మారింది.గతంలో సిబ్బందితో కళకలలాడిన ఈకార్యాలయం నేడు పిచ్చిమొక్కలతో నిండిపోయినిరుపయోగంగా మారింది.కార్యాలయానికి చుట్టంచూపుగా కుడ ఏ ఎక్కరు రారు సంవత్సరాల తరబడి తాళాలు వేసి ఉండడంతో పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగిపోవడంతో పాములకు నిలయాలుగా మారిందని కార్యాలయంలో పిచ్చిమొక్కలను తొలగించాలని పలువురు కోరుతున్నారు.

## సిరిపురంలో సిసి రోడ్డు నిర్మాణ పనులు



**మర్పల్లి జులై 11 ప్రభాతవార్త :** మర్పల్లి మండలంలోని సిరిపురంలో ఎంపీ నిధులతో సిసి రోడ్డు పనులను శుక్రవారం నాడు ప్రారంబించారు. మండల పార్టీ అద్యక్షులు రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూగ్రామాల అబివృద్ధి బిజెపితోనే సాధ్యమన్నారు.ఈసమావేశంలో అసెంబ్లీ కో ఆర్డినేటర్ వడ్ల నందు మలేశ్‌యాదవ్,బాలరాంగౌడ్,కుమార్, మైపాల్,యాదవరెడ్డి, బలవంత్‌రెడ్డి ,శివ,యదయ్య,నాగన్న,పలువురునాయకులు కార్యకర్తలు పాల్గోన్నారు.

# ఆమనగల్‌లో170 మందికి కంటి ఆపరేషన్లు

**-చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడి**
**-7 రోజులుగా శిబిరానికి మంచి స్పందన**
**-4500కి పరీక్షలు,**
**2800మందికి కంటి అద్దాల పంపిణి**



ఆపరేషన్లు చేయించుకున్న వారితో మాట్లాడుతున్న ఐక్యత సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి

**ఆమనగల్లు, జూలై11, ప్రభాతవార్త:** పేద ప్రజలకు అండగా, సమాజశ్రేయస్సు ఆకాంక్షతో లక్ష్యంతో ఐక్యత ఫౌండేషన్ ఆవిర్భవించిందని ఫౌండేషన్ వ్యవస్థాపక చైర్మన్, టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. విద్య, వైద్యం, ఉపాధి కల్పన కొరకు ఐక్యత నిరంతరం సేవలందిస్తుందని, కల్వకుర్తి ప్రాంత ప్రజల అభివృద్దే ధ్యేయంగా ఫౌండేషన్ ముందుకు సాగుతుందన్నారు. కల్వకుర్తి పట్టణంలో ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో కల్వకుర్తి పట్టణంలో గత 7రోజులుగా నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్యశిబిరంశుక్రవారం విజయవంతంగా ముగిసింది. ప్రముఖ ఆఫ్థామాలాజిస్టులు శిబిరంలో పాల్గొని కంటి పరీక్షలునిర్వహించారు.
మొత్తం 6000మంది హాజరుకాగా 4500 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 2800మందికి ఉచితంగా కంటి అద్దాలుపంపిణి చేశారు. శుక్ల లోపంతో బాధపడుతున్న 170మందిని ఉచిత కంటి ఆపరేషన్లకు ఎంపిక చేయగా, అందులో ఇప్పటికే 110 మందికి ఆపరేషన్లను విజయవంతంగా చేశారు. మిగిలిన వారికి ఆపరేషన్ల ప్రక్రియ పూర్తి చేస్తామని చెప్పారు. అంతకు ముందు ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి ముగింపు శిబిరానికి హాజరై ప్రసంగించారు. ఈసందర్భంగా సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి మాట్లాడుతూ అంధత్వ నివారణ కొరకు ఐక్యత ఫౌండేషన్ విశేషంగా కృషి చేస్తుందని చెప్పారు. సమాజ హితం కొరకు చేపడుతున్న సేవలను అర్హులైన ప్రతిఒక్కరూసద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కల్వకుర్తి నియోజకవ ర్గంలోని అన్ని మండలాల్లో ఉచిత కంటి పరీక్షల శిబిరం నిర్వహించామని తెలిపారు.
అంధత్వ నివారణకు ఫౌండేషన్ విశేషంగా కృషి చేస్తుందని, దృష్టిలోపంతో బాధపడుతున్న పేదలు ఆర్థికభారం మోయలేక కాలం గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షల శిబిరం నిర్వహించి అవసరమైన వారికి ఉచిత కంటి ఆపరేషన్లు, అద్దాలు పంపిణి చేస్తున్నట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు రచ్చ శ్రీరాములు, యూసఫ్, బాబా, మల్లయ్య, గణేశ్, శ్రీపతి, శేఖర్, రవి, యాదయ్య, శ్రీను, నాగిళ్ళ శివ, కళ్యాణ్ తదితరులు ఉన్నారు.

## విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

**నందిగామ జూలై 11 ప్రభాతవార్త**

ప్రపంచజనాభా దినోత్సవం పురస్కరించ కొనిశుక్రవారం మై భారత్ రంగారెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పెయింటింగ్ ఉపన్యాస పోటీలు పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ఎంపీడీవోసుమతి, ఎస్సై దేవరాజ్, ప్రధానోపాధ్యాయులు సుధాకర్‌లు బహుమతులు ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి మల్లికార్జున్ రెడ్డి , ఉపాధ్యా యులు శ్రీనివాస్, మనోజ్ కుమార్, మై భారత్ ప్రతినిధి దాసరి శ్రీశైలం , నవ తేజ యూత్ సభ్యులు చంద్రశేఖర్ , మధు,వంశీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




## కళాశాల నిర్మాణానికి రూ.52 వేల విరాళం



**షాద్‌నగర్,ప్రభాతవార్త,జులై11:**
షాద్‌నగర్ పట్టణంలో నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణానికి ఎన్‌హెచ్ 44 హోటల్ యజమాని రూ.52 వేలను విరాళంగా ఎమ్మెల్యేకు చెక్కును అందజేశారు. తన తమ్ముడి కుమారుడి జన్మదినం సందర్బంగా కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యేశంకర్, మాజీ ఎమ్మెల్యేచౌలపల్లిప్రతాప్‌రెడ్డిలు బాబుని ఆశీర్వదించారు.ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేపడుతున్నమంచి కార్యక్రమానికితనవంతు సహాయంగా ఈ విరాళాన్ని అందజేసినట్లు చందు తెలిపారు. ఈకార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు విశ్వం, పట్టణ పార్టీ అధ్యక్షుడు కొంకళ్ల చెన్నయ్య, నాయకులు చెంది తిరుపతి రెడ్డి, కొమ్ము కృష్ణ, పురుషోత్తం రెడ్డి, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## బిసిసేన మండల అధ్యక్షులుగా తోట మహేందర్

**నందిగామజూలై11 ప్రభాతవార్త:** నందిగామ మండలం రంగాపూర్ గ్రామానికి.చెందిన మాజీ ఉపసర్పంచ్ తోట మహేందర్ మండల బీసీ సేన అధ్యక్షులుగా ఎంపిక పట్ల రంగాపూర్ గ్రామస్తులు పలువురు హర్షం వ్యక్తం చేశారు. మృదుస్వభావి, సామాజికసేవా దృక్పథం కలిగి,నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే మహేందర్ బీసీ సేన మండల అధ్యక్షునిగా నియమితులు కావడం బీసీలకు మరింత మేలు జరుగుతుందని పేర్కొన్నారు. హర్షం వ్యక్తం చేసిన వారిలో చేశారు. రంగారెడ్డి జిల్లా బీసీ సేన ఉపాధ్యక్షులు మేకల వెంకటేష్, మండల కన్వీనర్ మహేష్ గౌడ్, నందిగామ మండల ఉపాధ్యక్షులు నర్సింలు, బీసీ నాయకులు నవపేట్ శీను, ఆవుల ఆంజనేయులు, నవపేట్ రవీందర్, ఆకుల జ్ఞానేశ్వర్, అల్వాల్ రమేష్, తోట అవినాష్, బాల్కొండ రంజిత్, కురువరాజు, రమేష్, తోట మైపాల్, గంగిశెట్టి శ్రీశైలం, మేకగూడ రమేష్ తదితరులున్నారు.

## నిరుపేదలకు ఆసరాగా ముఖ్యమంత్రి సహాయనిధి



**షాబాద్, జులై 11, ప్రభాతవార్త:** నిరుపేద కుటుంబాలకు ఆపద సమయంలో అందే ముఖ్యమంత్రి సహాయ నిధి డబ్బులు ఆసరాగా నిలుస్తాయని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్యలు అన్నారు. షాబాద్ మండలం నాగర్ కుంట గ్రామానికి చెందిన పాలమాకుల ఆనందం అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందడంతో సీఎం సహాయ నిధి నుండి వచ్చిన రూ.1 లక్ష 48 వేల చెక్కును నగరంలోని మక్దూం భవన్లో శుక్రవారం లబ్ధిదారునికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... నిరుపేదల కోసం ఏర్పాటుచేసిన సీఎం సహాయ నిధిని అందరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్మికులు, కర్షకులు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం సిపిఐ పార్టీ పోరాటం చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పర్వతాలు, రామస్వామి, పార్టీ షాబాద్ మండల కార్యదర్శి పాలమాకుల శ్రీశైలం పాల్గొన్నారు.

## అక్రమ ఇసుక రవాణా నేరం -ఎస్సై రమేష్ కుమార్



పోలీసులు సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్

**కుల్కచర్ల,జులై11, ప్రభాతవార్త :** అక్రమంగా ఇసుక రవాణా చేస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని కుల్కచర్ల ఎస్సై రమేష్ కుమార్ హెచ్చరించారు. శుక్రవారం కుల్కచర్ల మండల పరిధిలోని బొమ్మిరెడ్డిపల్లి గ్రామంలో దండు రాములు కు చెందిన ఇసుక ట్రాక్టర్‌ను సీజ్ చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం తెల్లవారుజామున బొమ్మిరెడ్డి పల్లి గ్రామానికి చెందిన దండు రాములు ట్రాక్టర్ పై (ఏపి 22టిఏ2233,34 నెంబర్ గల వాహనాన్ని అ నుమతి లేకుండా ఇసుక రవాణా చేసినందుకు ట్రాక్టర్ ను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల్కచర్ల మండల పరిధిలో రెవె న్యూ డిపార్ట్మెంట్ ద్వారా కానీ పోలీసు డిపార్ట్మెంట్ ద్వారా కానీ ఇసుక, మట్టి తదితర ప నులకు గా ను ముందస్తు అ నుమతులు తీసుకోవాలని లేనియెడల కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. జెసిబి ట్రాక్టర్ యజమా నులు విషయాన్ని గుర్తించి ప నులు చేసుకోవాలని లేని ఎడల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు.

## బిజెపి రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన బిజెవైఎం నాయకులు



**షాద్‌నగర్,ప్రభాతవార్త,జులై11:** భారతీయ జనతా పార్టీ నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన రాంచందర్ రావును రాష్ట్ర పార్టీ కార్యాలయంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో షాద్‌నగర్ బీజేపీ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయనను కలిసిన వారిలో బీజేవైఎం రాష్ట్ర నాయకులు వంశీకృష్ణ, బీజేపీ నాయకులు మచ్చ సుధాకర్ రావు, ఓబీసీ మోర్చ నాయకులు మల్చలం మురళీ, శ్రీనివాసాచారి, గిరిజన మోర్చ నాయకులు వినోద్ నాయక్, గజ్జల ప్రవీణ్‌లు ఉన్నారు.

## కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు..




**చేవెళ్ల, జులై 11, ప్రభాతవార్త:** ఆక్రమించుకున్న గిరిజనుల భూములను తిరిగి ఇప్పించాలని డిమాండ్ చేస్తూ కొండకల్ తండావాసులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా శుక్రవారం 182వ రోజు దీక్షలో పలువురు కూర్చొని మాట్లాడారు. ప్రైవేటు కార్పోరేట్ శక్తులు గిరిజనులకు సంబంధించిన భూములను ఆక్రమించుకొని వారిపైనే అక్రమంగా కేసులు పెట్టి వేధింపులకు పాల్పడుతున్నాయి అన్నారు ఈ విషయమై గత 182 రోజులుగా ఆందోళన కార్యక్రమాలు చేస్తుంటే ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గిరిజనులకు న్యాయం చేయాలని కోరారు.

## యువత స్వయం ఉపాధితో రాణించాలి



**షాద్‌నగర్, ప్రభాతవార్త, (జులై11) :** యువత ఒకరిపై ఆధారపడకుండా స్వయం ఉపాధితో అన్ని రంగాల్లో రాణించాలని షాద్‌నగర్ కాంగ్రెస్ మైనార్టీ నాయకుడు జమ్మద్ ఖాన్ సూచించారు. శుక్రవారం పట్టణంలోని నాగులపల్లి రోడ్డు స్టార్ ఈవీ బైక్ స్పేర్ పార్ట్స్, సర్వీస్ సెంటర్‌ను ఆయన ప్రారంభించి,సర్వీస్‌సెంటర్ నిర్వాహకులు ఎండి.సుమైర్, హర్ష రాజ్‌పుత్‌లను అభినందించారు.ఈసందర్భంగా నిర్వాహకులు జమ్మద్ ఖాన్‌ను ఘనంగా సన్మానించారు.ఈసందర్భంగా జమ్మద్‌ఖాన్ మాట్లాడుతూ వ్యాపారానికి ప్రస్తుతం ప్రభుత్వం కూడా రుణాలు అందజేస్తుంని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బీరప్ప,మహేందర్,జుబేర్, ముస్తఫా,ఫయాజ్, మనోజ్, స్వామి పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లు పరిశీలించిన అసిస్టెంట్ కలెక్టర్



**పూడూరు ,జూలై11, ప్రభాతవార్త :** వికారాబాద్ జిల్లా పూడూరు మండల పరిషత్తుకార్యాలయం ఆవరణలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మఆదర్శ ఇల్లును అసిస్టెంట్ కలెక్టర్‌హర్ష చొదరి శుక్రవారం సందర్శించి పరి శీలించారు.ఈ సందర్భంగా ఇల్లుకు వాడిన మెటీరియల్స్ గురించి సంబంధిత అధికారులను అడిగి తెలుసు కున్నారు.అనంతరం ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతిఒక్కరికి మొదటి విడతగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరి అయ్యాయని వాటిని నిర్ణీత సమయంలో లబ్దిదారులు నిర్మించుకునేలాచూడాలని అధికారులకు సూచించారు. సంబంధిత అధికారులు ు పాల్గొన్నారు.

## మందకృష్ణ మాదిగ సభకు వికలాంగులు భారీగా తరలిరావాలి

**వికారాబాద్, జులై 11, ప్రభాతవార్త :** వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఈ నెల 15న జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న సభకు ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ రానున్నారని వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు కె.జంగయ్య తెలిపారు. ఇందులో భాగంగా శుక్రవారం పట్టణంలోని ఆర్అండ్‌బి అతిథిగృహంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో వికలాంగులకు రూ.6 వేలు, వృద్ధులు, వితంతువులకు చేయూత పెన్షన్ 4వేలకు పెంచాలనీ డిమాండ్ చేస్తూ ఈ నెల 15న వికారాబాద్ జిల్లా కేంద్రంలో సభ నిర్వహించ నున్నట్లు ఆయన తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న వికలాంగులు,వృద్ధులు,వితంతువులు,పెద్దఎత్తునపాల్గొనాలనీ పిలుపు నిచ్చారు.సందర్భంగాఎంఎస్‌పీజిల్లాఅధ్యక్షులు పి.ఆనంద్ మాదిగ మాట్లాడుతూ,అన్నిఅర్హతలు ఉండి పెన్షన్లు రాక వికలాంగులు, చేయూత పెన్షన్ దారులు అనేక అవస్థలు పడుతున్నారని, ప్రతి ఒక్కరికి పెన్షన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అర్హత కలిగిన వారికి వాహనాలు ఇతర పరికరాలు అందజేయాలని, దివ్యాంగులు, చేయూత పెన్షన్ దారుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో మరో పోరాటానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు శామ్ ప్రసాద్, భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడుసుధీర్,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింలు మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుభాష్ మాదిగ, మహిళా నాయకులు పుష్ప రాణి, పద్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

## సిఎం సహాయ నిధి చెక్కులు అందజేత



**దౌల్తాబాద్, జులై 11,ప్రభాతవార్త:**
పేదల ఆరోగ్యానికి సీఎం రేవంత్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నరని కొడంగల్ నియోజకవర్గకాంగ్రెస్‌పార్టీఇంచార్జి తిరుపతిరెడ్డి అన్నారు. శుక్రవారం రోజుదౌల్తాబాద్ మండల కేంద్రానికి చెందిన మాలెల జయమ్మకు 1,00,000 రూపాయలు,మోహ్మద్ రసూల్‌కు 50,000 రూపాయల సిఎం సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను ఆయన అందజేశారు.ఈ సంధర్బంగా వారు మాట్లాడుతూ...ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజలు అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నప్పుడు వారికి అయ్యే ఖర్చును సీఎం సహాయ నిధి ద్వారా అందిచడం పేదల పాలిట వరం లాంటిది అని అన్నారు.ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న నిరుపేదలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగ పర్చుకోవాలనిఅన్నారు.ఈ కారక్రమంలో కొడంగల్ ఏరియా డెవలప్మెంట్ అథారిటీ ప్రత్యేకాధికారి కె.వెంకట్‌రెడ్డి,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వెంకట్రావు,మాజీ ఎంపిటిసి మంజుల దస్తప్ప పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు



**షాద్‌నగర్, ప్రభాతవార్త, జులై11 :** షాద్‌నగర్ మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మున్సిపాలిటీ సిబ్బదికి పోషకాహారంపై అవగాహన కార్యక్రమం, వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. మున్సిపల్ కమిషన్ సునీత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరానికి డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మీ హాజరై ఆర్పీలు, మున్సిపల్ సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం స్త్రీలకు బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. బ్రెస్ట్ క్యాన్సర్‌ను మొదటి స్టేజ్‌లోనే ఎలా గుర్తించాలనే విషయాలను వివరించారు. అదేవిధంగా వారు తీసుకునే పోషకాహారంపై అవగాహన కల్పించారు. మొత్తం 26 మంది సిబ్బందికి బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. ఇందుళక్ష 18 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, అందులో ముగ్గురికి కాంట్రాక్ట్ ఉందని గుర్తించారు. ఈ కార్యక్రమంలో చించోడ్ వైద్యాధికారిణి డాక్టర్ స్రవంతి, డాక్టర్ కార్తీక్, డాక్టర్ సత్యనారాయణ, డాక్టర్ సంధ్య, డాక్టర్ ప్రవీణ, హెల్త్ ఎడ్యుకేటర్ జె.శ్రీనివాసులు,రమేష్,మున్సిపాలిటీ సిబ్బంది సాయికుమార్, రెహమాన్, శివ, యాదమ్మ, చంద్రకళ, విజయలక్ష్మీ పాల్గొన్నారు.

## జనాభా పెరుగుదలతో వనరులపై ప్రభావం

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జులై 11, ప్రభాతవార్త:** పెరుగుతున్న జనాభా వనరులపై ఒత్తిడిని పెంచి ఆహారం, నీరు, ఆరోగ్యం, విద్య వంటి ప్రాథమిక అవసరాలపై ప్రభావం చూపడంతో నిరుద్యోగం, పేదరికం వంటటి సమస్యలు తీవ్రమవుతున్నాయని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ సి.ఉమాగౌరీ అన్నారు. అంతాయపల్లిలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో శుక్రవారం ప్రపంచ జనాభా దినోత్సవం-2025 సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. . ఈసందర్భంగా జిల్లా వైద్య శాఖలో విశిష్ట సేవలు అందించిన ఉద్యోగులకు మెరిట్ సర్టిఫికెట్లు, మెమెంటోలు అందజేశారు. మల్కాజ్‌గిరి, కీసర డివిజన్‌ల ఉప జిల్లా వైద్యాధికారులు డాక్టర్ శోభ,డాక్టర్ సత్యవతి, జిల్లా ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ చంద్రకళ, డాక్టర్ గీత, డాక్టర్ మల్లేశ్వరీ, డాక్టర్ కౌశిక్, సూపర్‌వైజర్లు ఎర్రగిన్నెల విజయ్‌కుమార్, లింగాల అక్షయ్‌కుమార్, కమల్, జిల్లా పిహెచ్‌సిలు, యూపిహెచ్‌సీలు, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పోతులవాగు కబ్జాకోరులపై క్రిమినల్ కేస్

**ధారూరు ఠాణాలో ఎఫ్ఐఆర్ ఇరిగేషన్ ఏఈ ఫిర్యాదుపై స్పందన**
**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :**

పోతులవాగు కబ్జా కోరులపై ధారూరు పోలీసులు క్రిమినల్ కేసులు నమోదు చేశారు. కోటపల్లి మధ్యతరహా ప్రాజెక్టు కుడికాల్వ కింద పెద్దేముల్ మండలం మారేపల్లి శివారు, ధారూరు మండలం అల్లాపూర్ శివార్ల మీదుగా ప్రవహించే పోతులవాగును ఆక్రమణకు గురి చేశారు. దీనిపై జూన్ 29న వార్త దినపత్రికలో వెలువడిన కథనానికి స్పందించిన నీటిపారుదలశాఖ సహాయ ఇంజనీరు నీరజ విచారణ జరిపారు.
వాగు ఆక్రమణకు గురైనట్లు తెలుసుకున్న ఏఈ జూలై 9న ధారూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు లతీఫ్, లింగజైరెడ్డి అనే వ్యక్తులపై భారతీయ న్యాయ సమితి (బీఎన్ఎస్) సెక్షన్ 326/బీ కింద కేసు నమోదు చేసినట్లు ఎస్సై అనిత తెలిపారు. త్వరలో ఈ కేసుపై తగిన చర్యలు చేపడతామని ఆమె చెప్పారు. ఇలా ఉండగా పోతులవాగు ఆక్రమణకు గురికావడం పట్ల మారేపల్లి రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.



ఎంతటివారైనా కబ్జాలకు పాల్పడితే కఠినంగా వ్యవహరించాలని రైతులు వెంకట్‌రెడ్డి తదితరులు కోరారు.